

# బాల




6



కుమారి యింగువ అంబికాదేవి (యామిని)

బహు బహుమతులబాల



కుమారి జి. సూర్యప్రభ

నవ్వు పువ్వు



కుమారి పోర్నపూడి సుభద్ర

# చందూ యొక్క సాహసము




ది తాతా ఆయిల్ మిల్స్ కంపెనీ, లిమిటెడ్.

# అమృతాంజనము

తామర తంపరగా పడుబాధల - తరుమజాలనని భయపడకు
అమృతాంజనము పేరువినినచో - అవియెల్లయు గడగడ వడకు ॥తా॥

తలనొప్పికి తలనొప్పి పుట్టును - కంటినొప్పి కనుకనబడదు
పంటినొప్పియు పలాయనంబగు - తుంటినొప్పియు తుడుచుకపోవును॥

ఏదో ఒకరూపముతోవచ్చి - యెల్లరినివియే పీకితినున్
బాధల నణచి సేదదీర్చుకొన - స్వీకరింపు మమృతాంజనమున్ ॥తా॥

రొంపదగ్గు ఎగశోషలకు - చెంపపెట్టు అమృతాంజనము
వాతము పట్లను నరముల పోట్లను - వారించెడి దమృతాంజనము ॥తా॥

తామర గజ్జి సెగ కురుపులను - తరుమ గలది అమృతాంజనము
అలసిన మేనుకు బలము గూర్చును - అమృతాంజనపు మర్దనము ॥తా॥

బుద్ధి బలంబు ప్రయోగ మధికమై - స్తబ్ధతకూడిన వారలకు
శుద్ధంబైన చుఱుకు తనము చవి - చూపించెడి దమృతాంజనము ॥తా॥

పని పాటులు చల్లగ చేసుకొని - మనుగడ శ్రీమంతముగ గడుపుకొన
మదిలోపలను ఉవ్విళ్లూరే - మనుజకోటికిని కైదండ యిది ॥తా॥

పట్టములందును పల్లెలయందును - పీఠంబులు నెలకొల్పుకొని
బాధా పీడిత జనులందరికిని - పరమాద్భుతసాయముచేయున్ ॥తా॥

"ఎప్పుడెప్పుడే బాధకలిగినా - తప్పించెడి దమృతాంజనమే"యని
పిన్నపెద్దలు పాడుచుండెడి - ప్రేమ గీత మమృతాంజనము ॥తా॥

గరిమెళ్ళ సత్యనారాయణ బి. ఎ.





**'BALA'—CHILDREN'S ILLUSTRATED MONTHLY**

సంపాదకుడు : సహాయ సంపాదకురాలు :

న్యాయపతి రాఘవరావు, బి. ఎ. న్యాయపతి కామేశ్వరి, బి.ఎ.,ఎల్.టి.

సంపుటి 5] జులై, 1950 [సంచిక 12


# మిఠాయి సంచిక గురించి

బాలలూ!

ఈ సంచికతో "బాల" 5 సంవత్సరములు పూర్తి చేసింది. ఒచ్చే సంచికనుంచి ఆరోఏడు ప్రారంభం. ప్రతి సంవత్సరం ఆగస్టులో మిఠాయి సంచిక వేయడం మామూలు. అలాగునే ఈయేడుకూడా మిఠాయి సంచిక వస్తుంది. కాని - ఒక చిన్న విషయం.

మార్కెటులో కాగితం ఖరీదులు విపరీతముగా పెరిగిపోయాయి. మంచి తళుకుగల ఆర్టు పేపరు అట్టే దొరకదు! అదీగాక "బాల" ప్రెస్సు ఈ నెలలోనే ఇంకో పెద్దఇంటికి మారుతోంది. ప్రెస్సుని మార్చడం అంటే చాలా గొడవవుంది. ఈ కారణాలచేత, ఇదివరకు మీకు ప్రతీయేడూ ఇస్తున్న 1 రూ॥ విలువగల పెద్ద మిఠాయి సంచికను ఈయేడు వేయడానికి వీలులేదు. మామూలుగా 6 అణాలకే సుమారు 100 పేజీల మిఠాయిసంచికను వేసి పంపుతాము. రంగులూ, హంగులూ అన్నీ వుంటాయి లెండి.

మిఠాయి సంచికకు బదులుగా ఈ సంవత్సరం దీపావళీ సంచిక పెద్దదిగా వేయాలని అనుకుంటున్నాం. దానిని గురించి మున్ముందు రాస్తాం.

ఈ 5 సంవత్సరాల నుంచీ "బాల"ను చదువుతూ ప్రోత్సహించిన మీకు "బాల" జేజేలు.

బాలక్కయ్య


బాలన్నయ్య

# అట్టమీది బొమ్మ *

ఈనెల అట్టమీది బొమ్మను చూశావా? అది ఒక బడి. అది బాలలబడి. ఆబడిలో ఆడపిల్లలూ, మొగపిల్లలూ అందరూ కలిసే చదువుతారు. రెండు నెలలైంది. వేసవిసెలవుల్లో బడి మూసి వుంది. ఇప్పుడే తిరిగి బడితెరిచారు. అదుగో! చూశారా? పిల్లలందరూ ఎంత సందడిగా బడికి వెళ్తున్నారో! కొత్త పలకలు, కొత్త పుస్తకాలు పట్టుకొని గబగబ వెళ్తున్నారు. లలిత అందరి కంటే ముందుగానే వెళ్లి క్లాసులో కూర్చుంది. సరళ అప్పుడే మెట్లు ఎక్కుతోంది. అనిల్‌బాబు కాళ్లకి మేజోడు, బూట్సు వేసుకొని బలే హుషారుగా అడుగులువేస్తూ వెళ్తున్నాడు. లీలా రామం అక్కా తమ్ముళ్లు. వాళ్లిద్దరూ ఒకేక్లాసు. ఇద్దరూ జట్టుగా బడికి పోతున్నారు చూచావా? చెట్టుపక్కన ఆపెద్దపిల్లే విరళ, విరళ మూడోక్లాసు ఫెయిలయింది. అయినా, సిగ్గులేకుండా, షోగ్గా ముస్తాబై బడికి తయారయింది. అందరి దృష్టీ బడివేపు వుంటే విరళదృష్టి ఆ మిఠాయి అమ్మేవాడి వైపువుంది. ఐస్ ఫ్రూట్ తింటేనేగాని ఆ అమ్మాయి బడిలోనికి కాలుపెట్టదు!

ఇదుగో ఇటుచూశారా? వీడు మన సోముతమ్ముడు. ఒకటోక్లాసు ఫెయిలయినాడు, బడికి వెళ్లడానికి మారాం చేస్తున్నాడు. వాళ్లనాన్న కర్రతో నాలుగు ఇచ్చుకుంటున్నాడు. బడి మొదటిరోజునే చిన్నసోము ఒక పలక విరిచేశాడు! ఇంకా ఎన్ని పలకలు విరుస్తాడో!

ఈ ఆరుగురు బఫూన్లూ మనవేపుచూసి నవ్వుతున్నారు! ఆ పెదిమలకు ఎంత రంగు పూసుకున్నారో చూశారా!




ఆరుగురు బఫూన్లూ ఒకేలాగ వున్నారు. కాని అందులో ఇద్దరు మాత్రమే కవలలు. వారెవరో పోల్చుకోగలవా? లేకపోతే జవాబు ఆఖరు పేజీలలో చూడు.



# రాము



బడులు తెరిచారు. పుస్తకా లన్నీ నీటుగా సర్దుకోవాలి.



సరిగా టైముకి బడికి పోవాలి. లేకపోతే చాలా అవమానం కలుగుతుంది.



మొదటి నుంచీ పాఠాలు శ్రద్ధగా వింటే పరిక్షలు తేలికగా ప్యాసు అవచ్చు.

# సోము



పాత పుస్తకాలేగా! గాడిద గుడ్డు! ఏలాగుంటేనేం!

ఇప్పుడేగా బడులు తెరిచారు. ఇంకా పాఠాలు మొదలెట్టారు. కాస్త ఆలస్యంగా వెళ్ళినా ఫరవాలేదు.

ఛీ! ఛీ! మొదటి రోజునే యీ మేష్టరు బెంచీ ఎక్కించాడు! ఆలశ్యంగా వచ్చినందుకు దెబ్బలుకూడాను.



# పెంకిరావు పాఠం

రచన: జె. చెన్నమూర్తి (అనకాపల్లి)

[మనలో కొందరు డిప్పకాయలుంటారు. వాళ్లు ప్రతీ దానికి ఎడదిడ్డం అంటే పెడదిడ్డం అని వాదిస్తారు. అటువంటి డిప్పకాయగురించి కథ]

నా చిన్నప్పుడు అంటే నాల్గవ తరగతి చదువుకొనే రోజు లలో, ఒకనాడు శెలవురోజున, మా తరగతి కుర్రవాళ్లందరు గ్రామానికి దగ్గరలో నున్న సత్యనారాయణ స్వామివారి ఆలయానికి వెళ్లాం. ఆగుడి చిన్న కొండమీద కట్టినారు పూర్వులు. ఆరోజున తీర్థం గనుక, చాలా మంది కొండమీదకు కబుర్లు చెప్పుకుంటూ ఎక్కుచున్నాము. మాలో శంకర్రావని ఒక పెంకి డిప్పకాయ ఉండేవాడు. అందరూ అవునన్నదానికి వాడు కాదని వాదించేవాడు. ఎంత చెప్పినా వినేవాడు కాడు.

పాపం! మెట్లమీద అనేక మంది ముష్టివాళ్లు, కాళ్లు లేని వాళ్లు, కళ్లు లేనివాళ్లు ఎంతో దీనంగా ప్రజల్ని ధర్మం అడుగుచున్నారు. కొంతమంది తోచింది యిస్తున్నారు. కొంతమంది మాట్లాడకుండా పోతున్నారు. మాలో ఒకడు అన్నాడు కదా! పాపం, ఈ కళ్లు లేని వాళ్లకు కుంటి వాళ్ళకు ఎవరుదిక్కు? ఎంత మంది ఉన్నారో! వీళ్ళకు దేవుడే



దిక్కు. దయగలవాళ్లు ఏమైనా యిస్తే దాంతో బ్రతుకుతారు. లేదా, ఆరోజుకు పస్తే అన్నాడు. వెంటనే శంకర్రావు అందుకున్నాడు వాడనకు: " వాళ్ళకర్మం అంతేరా! పూర్వజన్మలో వాళ్లు పాపాలు, చెడ్డపనులు చేస్తే యీ జన్మలో యిలా పుడతారు. భగవంతుడు యీవిధంగా వాళ్ళను శిక్షిస్తాడు. ఆశిక్ష వాళ్ళు అనుభవించ వలసినదే. వాళ్ళకు మనము సహాయముగాని, ధర్మం గాని చేసినయెడల భగవంతుని ఉద్దేశానికి మనము వ్యతిరేకము చేస్తున్నా మన్నమాట! అని తెగ వాదించేడు.

అలా మాట్లాడుకుంటూ కొండఎక్కి దేవుణ్ణిచూచి తిరిగి వస్తున్నాము. శంకర్రావు అన్నాడు కదా: " ఆ ముష్టివాళ్ళ మధ్య నుంచి మనము పోవద్దు. ప్రక్క దారినుంచి కొండ దిగుదాము. మంచి మంచి చెట్లూ, వింత వింత తీగలూ చూచుకుంటూ దిగుదాం. అని ప్రక్కదారి తీసాడు. ఆదారిని ఎవరూ దిగడంలేదు. వీడి నోటికి భయపడి మేము వాడిని వెంబడించాము.

కొంచెము దూరము దిగినతర్వాత శంకర్రావు కాలు జారినందున, వాడు దొర్లుకుంటూ చాలదూరంలో పడ్డాడు. వంటినిండా దెబ్బలు రక్తం. కాలికి బలమైన దెబ్బతగిలింది. ఏడుస్తున్నాడు. అప్పుడు మాలో కొందరన్నారు. వీడు పూర్వజన్మలో ఏమో పాపాలు చేసాడు. అందుకు భగవంతుడే వీడికీశిక్ష విధించేడు. మనము వాడికి సహాయము చేసి కట్లుకట్టి యింటికి తీసుకువెళితే భగవంతుని ఉద్దేశానికి వ్యతిరేకమవుతాము. పోదాం పదండి,



అని మాదారిని మేము జాగ్రత్తగా దిగుచున్నాము. శంకర్రావు ఏడుస్తూ ఒరే నన్ను విడిచి పోతారా! నా తప్పులు క్షమించండి. నాకు బుద్ధివచ్చింది. ఇతరులకు చేతనయినంత సహాయము చేయుట మంచిది. భగవంతుడు మెచ్చుకుంటాడు. ఎప్పుడూ యిలాంటి తప్పువాదనలు చేయను అని బ్రతిమాలాడు. తర్వాత వానికి కట్లుకట్టి, వాళ్ళ యింటికి చేర్చాము. శంకర్రావు పెంకితనం వదలింది.






# మంచి ఇంగువ

మంచిరకపు ఇంగువ దొరకడం చాలాకష్టం, మేలైన ఇంగువ ఎక్కడ దొరుకుతుందో చాలామందికి తెలియదు. మంచి ఇంగువను ఉపయోగించకపోతే, ఇంగువనువాడిన ప్రయోజనమేలేదు. మంచి ఇంగువ కావాలంటే 'తిలక్ మార్కు' ఇంగువ కొనండి. తిలక్ మార్కు ఇంగువ అన్ని దుకాణాలలోను దొరుకుతుంది. లేదా యీ క్రింది అడ్రసుకు వ్రాయండి.

## గోపాల్‌జీ చాంప్‌షీ అండ్ కో.,

80, గోవిందప్పనాయక్ వీధి * * జి. టి. మదరాసు.




చిటుకు :-ఒరేయ్ లటుకూ! నేనీచేత్తో రైలు నాపివేయగలనురా!

లటుకు :-ఎలాగ ఆపగలవూ? నీతరం కాదు!

చిటుకు :-నేను రైలుడ్రైవరు నయితేసరి!

సోమంచి శివరావు (కావలిపురం)

♦ ♦ ♦

లటుకు :-చిటుకూ! నేను పెళ్ళాడు తున్నాను. తెలుసా?

చిటుకు :-ఎవరిని? సీతనా? విమలనా? శకుంతలనా? రాధనా? శ్యామలనా? లలితనా? కమలనా? సావిత్రినా? లీలనా? సుందరినా? సరస్వతినా? సత్యవతినా? జ్యోత్స్ననా? అరవిందనా? ఉషనా? రేవతినా? సరళనా? సుగుణనా? మాలతినా? కళ్యాణినా? సుభద్రనా? అనసూయనా? పార్వతినా? భారతినా? పద్మనా? గుణవతినా? కాంతాన్నా? మోహిన్నా? మీనాక్షినా? లక్ష్మినా? అంజలినా? భానుమతినా? కుమారినా? శాంతనా? చెప్పు ఎవరినో?

లటుకు :-అబ్బే! వీళ్ళేవరినీ కాదు! నాపిల్లాన్నే నేను పెళ్ళాడుతున్నాను.



# క.ల రా

రచన: పి. సుబ్బారావు

అనగా అనగా ఒకఊరు
ఊరుబయటనే ఒకయేరు
ఏటినీటికై ప్రతీవారు
వస్తూ పోతూవుంటారు.

* * *

వానలువస్తే ఆయేరు
పొరలి పోతుందంటారు
ఎండలుకాస్తే ఆయేరు
ఎండుకపోతుం దంటారు.

* * *

వానలువస్తే ప్రతీవారు
వరదకు పూజలు చేస్తారు
ఎండలుకాస్తే ప్రతీవారు
ఏటికి దొడ్డికి పోతారు !
ఎవరో ఎప్పుడో వచ్చాడు
ఏటినీటికై వచ్చాడు
కలరాతోపడి చచ్చాడు
ఊరికి కలరా వచ్చింది !

* * *

పోలేరమ్మకు బలిలేదు
సుంకాలమ్మకు బలిలేదు
ఔనంటే ఔననుకొంటూ
జనాలు దేవరచేశారు.

# సూదులు

(యస్. యస్. యల్. సి.)

జనాలు రోజూ చచ్చారు
రోజూ జనాలు చచ్చారు
ఇంతలో ఎవరో వచ్చారు
ఎవరో ఊరికి వచ్చారు.

* * *

మందుల మాకుల పెట్టెలతో
సూదుల గీదుల పెట్టెలతో
అట్టల టోపీ బుట్టలతో
కాలీకాలని చుట్టలతో,
మందులు సూదులకెక్కాయి
సూదులు చేతుల కెక్కాయి
వీధులు అన్నీ తిరిగారు
జనానికంతా గుచ్చారు.

* * *

ఇంతలో వానలు వచ్చాయి
వానలు వరదలు తెచ్చాయి
ఊరికి వానలు వచ్చాయి
ఊరికి వరదలు తెచ్చాయి.

* * *

దేవర మెచ్చే వెలిసిందో
సూదులుగుచ్చే వెలిసిందో
వానలువచ్చే వెలసిందో
కలరా మాత్రము వెలిసింది.



# పొట్టిబావ
## పుట్టినరోజు

చిట్టిమరదలూ
గట్టిదెసుమ్మా!
పుట్టినరోజున
పొట్టిబావకు
పెట్టింది ఓ తంటా!
ఎట్టిదో తెలుసా!
నట్టి ఇంటిలో
ఉట్టికెగరమనె!
పొట్టిబావ అప్పుడు
దట్టించె పొడుము.
జట్టిలేకుండా
రొట్టితిన్న బలంతో

గట్టిగ ఎగిరె
ముట్టెవిరిగెసుమ్మా!
తట్టిలేపె పిల్ల
కొట్టిలేపెపిల్ల.
వొట్టిబడుద్ధాయీ
కిట్టిగాడు నవ్వె!
మొట్టినాడు వాని
తిట్టినాడు దీన్ని!
జుట్టు సర్దుకుంటూ
ఇట్టెపారి పోయె
పొట్టిబావ అపుడు!
గట్టిదేసుమ్మా
చిట్టిమరదలు!

రచన: కోలగొట్ల సూర్యప్రకాశరావు
(శ్రీకాకుళం)


**Kora. NARASIMMULU CHETTY & SON**

• JEWELLERS, DIAMOND MERCHANTS, & SILVER WARE MANUFACTURERS. •

217/3. CHINA BAZAAR ROAD, MADRAS. I. ...




అసలు సవరపు బంగారముచేత చేయబడిన రంగూను రాళ్ల కమ్మలు.

వివరములకు పై అడ్రసుకు వ్రాయండి.

# దాగుడు అవయవాలు

బాలా! ఈక్రింది వాక్యాలలో కొన్ని శరీరాలు దాగున్నాయి తేల్చుకో!

1. ఎందుకా లుంగీ అస్తమానం కడతావు?
2. రామూ! తిలకము పెట్టుకోవేమిరా?
3. ఆవస్తువు వానిచే యివ్వబడెను.
4. తెనాలి రామలింగని చూచి రాజు ఇట్లరచె: "వికటకవీ!" అని.
5. ఎందులకా మొడుంబాలు వింటావు?
6. ఓకవీ! పుష్పాన్ని వర్ణించు.
7. మునీశ్వరుల వద్ద కాదే కమండలముండును.
8. ఆమె వెరపే గుండెజబ్బుకు కారణం.
9. అలివేలు మంగమ్మ అలుకా జెండకుమమ్మ!
10. ఏదిచెప్పినా వీడితో డబ్బుల సంగతి చెప్పకు.
11. బాలా! నువ్వు కడు పుణ్యాత్మురాలివి.
12. గోపిగాడు చుట్టపీకలు తాగుతున్నాడు.
13. ఏ ఋషినో, మునీశ్వరునో రుద్రాక్షలడుగు.
14. ఆమెను దురుసుమాట లాడకు!
15. ఉల్లిగడ్డ ముదిరిపోయింది.

కూర్పు : ఆంధ్ర భాస్కరసుబ్బారావు (విజయనగరం)

(జవాబులు ఈసంచికలోనే)

---

**తెలుసా**

కుందేటి కండ్లకు రెప్పలు లేవు. కుందేళ్లు, [illegible]ట్టములు, ఈగలు – వీనికి ముందుచూపు, వెనుకచూపుకూడకలదు.

జడ బ్రహ్మయ్య (నిడుబ్రోలు)

# మామిడి పండు

P. S. నారాయణ, (బొబ్బిలి)

యని మామిడి పండూ
ంటే హుషారుగా వుండూ
ంగిని పిల్లీ పండు
లెబాగా వుండు
ోవా మామిడి పండు
ోవాలాగ వుండు
ువర్ణ రేఖ పండు
ూస్తేనే బాగుండు
రకురసాలండీ
క్కరవంటివి అండీ

ఆహా! తీయని మామిడిపండూ
తింటే కడుపంతా నిండు
చక్కగ పండిన పండు
ఒక్కటి అయినా నిండు
ఎక్కువ కావాలంటాం
చిక్కులు తెచ్చిపెడతాం
కమ్మనిమామిడిపండు
తెమ్మని కోరే పండూ
ఘుమ ఘుమ వాసన
కొట్టే దుమా అయినపండు
అల్లరి చేయని పిల్లల
కిచ్చేమామిడి పండు
తీయని మామిడి పండూ
తింటేనే కడుపు నిండూ


PLEASE NOTE CHANGE OF ADDRESS



18 CT. ROLLED GOLD
5 ? TANNOEAU
15 JEWELS SUPERIOR
QUALITY WHITE
ARABIC DIAL Rs. 75.
GUARANTEED 10 YEARS.



World standard Smith
Dawn Alarm Time-Piece
Silver Dial. Radium Dots
& Radium Hands
Rs. 18-8-0
GUARANTEED 5 YEARS



18 CT. ROLLED GOLD
7 ? CURVEX
15 JEWELS SUPERIOR
QUALITY WHITE
ARABIC DIAL Rs. 85.
GUARANTEED 10 YEARS

No despatch will be made without advance for Time-Pieces.

OUR SPECIAL CATALOGUE ON REQUEST

WEST END & FAVRE LEUBA WATCHES ALSO AVAILABLE

**RIZVON & BROS, - 177, Devaraja Mudali, St., Madras I**



# పొడుపుకథలు

## 1

రాతిమీద చక్రం, కోటొక్క దిక్కులుచూస్తోంది...!

## 2

చీకటి అవుతే చూస్తారు; వెలుతురుంటే గోలచేస్తారు...!

## 3

అణా డబ్బులతో ప్రపంచం అరచేతిలోకి వస్తుంది...!

## 4

లంకలోనివారు లండనులోని మాటలు విన్నారు...!

## 5

చుక్కలమధ్య చంద్రుడు, మన ప్రక్కవారింటిమీద వున్నాడు...!

కూర్పు: పి. యస్. నారాయణ & యస్. బి. కుమార్ (బొబ్బిలి)

## 6

పువ్వువలె నుండక, ఆకువలెనుండి దారిపోవువారిని ఆకర్షించును...!

—పులి పాపయ్య (పేటపాలెం)

## 7

ఆకులేని అడవిలో, జీవంలేని జంతువు జీవంగల జంతువును వేటాడ బోయింది...!

—ద్వారంపూడి లక్ష్మీనారాయణరెడ్డి (గొల్లల మామిడాడ)

## 8

మాఇంటికి రెండుపంటలు; ఉదయు వెళ్లి సాయంత్రం వస్తుంది. అదిఏమి...!

—ఎస్. వి. రఘునాధరావు (టెక్కలి)

## 9

తొమ్మిదిమంది సిపాయిలకు ఒకేజుట్టు...!

—ఓ. నటరాజన్ (మదరాసు)

[జవాబులు ఆఖరు పేజీలలో]

# ఇవి చేసుకోండి


— డి. శ్రీనివాసరావు (మదరాసు) —

బొమ్మలో చూడండి. చేతికి

ఏదో కట్టు కట్టినట్టు వుంది. ఇదేమీ ప్రమాదం జరిగినప్పుడు కట్టిందికాదు. ఒక ప్రయోజనం కోసం కట్టింది మాత్రమే! ఇదొక వుపాయం. దీనివల్ల వుపయోగం వుంది. చేతిమణికట్టు దగ్గఱ కట్టింది జేబురుమ్మాలు!

మామూలుగా మనం మొహం కడుకునేటప్పుడు చేతిలో వున్ననీళ్ల మణికట్టుదగ్గరకు కారి అక్కడనుంచి మోచేతి వరకు వస్తాయి. ముఖ్యంగా సబ్బుపెట్టి రుద్దేటప్పుడు, గెడ్డం మెడదగ్గఱ కడుక్కునేటప్పుడు నీళ్లు మోచేతిదగ్గఱకు కారతాయి. చిరాకుగా వుంటుంది. ఒక్కొక్కప్పుడు చొక్కా వుండగనే మొహం కడుక్కోవలసిన అవసరం కలుగుతుంది. ఇటువంటి సమయాల్లో చొక్కా చేతులు కూడా తడుస్తాయి. బొమ్మలో చూపించినట్టు జేబు రుమ్మాలు గాని, లేక చిన్నగుడ్డగాని చేతి మణికట్టు చుట్టు కట్టి మొహం కడుక్కున్నట్లయితే మణికట్టు దాటి నీళ్లు కారవు.





మొహం కడుకునేటప్పుడు, మొహంమీద వున్ననీరు నెమ్మదిగా కారి మెడమీదకు కూడా వస్తూ వుంటుంది. ఇల్లాంటి సమయాల్లో 'చొక్కామెడ' తడిసిపోవడం జరుగుతుంది.

బొమ్మలో వున్నట్టు ఒక తువ్వాలుగాని, గుడ్డగాని మెడచుట్టు చుట్టి భుజాలమీద కప్పినట్లయితే మొహంమీదనుంచి నీరు క్రిందికి కారి మెడమీద పడకుండా వుంటుంది,

మనకన్న ఎత్తున వున్న వాటికి రంగులుగాని, సున్నముగాని వేసేటప్పుడు మణికట్టు దగ్గఱ గుడ్డ కట్టుకోవడము మంచిది.

## “ముద్దుబిడ్డ”-అనే బాల నాటకం

బాలలూ!

మీకు నాటకాలంటే బలే ఇష్టంకదూ! రాయలసీమలో మంచి మంచి నటులు వుండేవారు. ఇప్పుడు సినిమాలు వచ్చిన తరువాత నాటకాలు తగ్గిపోయాయి. తిరిగి నాటకాలు వేయడం మనం నేర్చుకోవాలి. బాలలందరూ నాట్యకళను మరిచిపోకూడదు.




అంచేత ఉరవకొండలో మేము “బాల నాట్యకళా సమితి” అని ఒక సమితి పెట్టి, మా స్వంత రచన “ముద్దుబిడ్డ” అనే నాటకం త్వరలో ఆడబోతున్నాం.

—టి. వీరన్న (సెక్రటరీ

# తమాషాలు

## నేనెవరు?

రాము :-సోమూ! ఎందుకూ ఏడుస్తున్నావు?

సోము :-నాన్న అమ్మను పంది అన్నాడు. అమ్మ నాన్నను దున్నపోతు అన్నది.

రాము :-అయితే నువ్వెందుకు ఏడవడం?

సోము :-అమ్మ పంది, నాన్న దున్నపోతు అయితే నేనెవర్ని అని.

## మర్యాద

గయ్యాళిభార్య :- (బంధువుల ఎదుట) ఏమండోయ్! మిమ్మల్నే! పలకరేం?

పిరికి భర్త :- ఆ! నన్నేనా! "ఏమండోయ్" అంటూంటే ఎవర్నో అనుకున్నాను.

## దగ్గర బంధువులు

జైలు అధికారి :- (ఖైదీతో) ఏమిరా! నీబంధువు లెవరూ నిన్ను చూడ్డానికి రారా?

ఖైదీ :-రావడం దేనికి బాబయ్యా! అంతా ఇక్కడే ఉన్నారు.

పిరాట్ల అచ్యుత రాధాకృష్ణ
(కాకినాడ)

* * *

## కొత్త తమాషాలు

రాము :-ఏమిరా గోపూ! పాత హాస్య పుస్తకాలన్నీ తెగ వెతికేస్తున్నావ్?

గోపు:-ఏమీ లేదురా! పత్రికలకు తమాషాలు రాద్దామనుకున్నాను. ఇందులో ఏమన్నా కొత్త తమాషాలు దొరుకుతాయేమోనని వెతుకుతున్నాను.

* * *

## పాస్

ఇద్దరు కుర్రాళ్లు ట్రాంలో వెళ్తూ వుంటారు.

ఒకడు :-ఏమోయ్ నీది పాసా?

ఇంకొకడు :-లేదోయ్. నాపరీక్ష పోయింది.

ఒకడు :-అదికాదూ! నీ దగ్గర

ట్రాంపాసు వుండా లేక టిక్కట్టు కొనుక్కున్నావా అని అడిగాను!

* * *

## ప్రయాణం

ఒకడు :-ఇంటికి వెళ్లడానికి బస్ ఛార్జికి రెండణాలు వుంటే ఇస్తావా!

మరొకడు :- చిల్లర లేదు. అర్ధ రూపాయే వుంది.

ఒకడు :-సరి. దాన్నే ఇయ్యి. రిక్షాలో ఇంటికి వెళ్తాను.

—బి. రామారావు (మద్రాసు)

* * *

## నోరు మూసుకో

తల్లి : ఒరే! మాట్లాడక నోరు మూసుకొని అన్నం తినరా!

కొడుకు :-నువ్వు చేతులు కట్టుకొని వడ్డిస్తే నేను నోరు మూసుకు అన్నం తింటాను.

—యనమండ్ర సోమేశ్వరరావు (కాకినాడ)

* * *

## బడిలో నిద్ర!

మేష్టరు :-(నుంచుని పాఠం చెబుతూ) ఒరేయ్ నిద్ర పోతున్నావా!

వేణు :-లేదండి సార్! మేమందరం కూర్చుంటే మీరు నుంచోటం చూడలేక కళ్లు మూసుకున్నానండీ!

—దాడి వెంకట రమణారావు (అనకాపల్లి)

* * *

## లాభం

పోలీసు :-ఏమయ్యా శెట్టీ! నువ్వు 100 కి 100 చొప్పున లాభం తీస్తున్నావట! ఇది న్యాయమేనా!

శెట్టి :-అబ్బే! నాది అంత ఘోర వ్యాపారం కాదండి. నేను దమ్మిడీకి దమ్మిడీ చొప్పున మాత్రం లాభం తీస్తున్నా. అంతేనండి.

పోలీసు :-ఇంతేనా! సరే నిన్ను విడిచిపెట్టాను, పో.

—యం. రాజేంద్రరెడ్డి (ఆరగొండ)

బాల
(పిల్లల బొమ్మల పత్రిక)
చందా సాలుకు రూ౩/-
"బాల" ఆఫీసు
170, రాయపేట హైరోడ్,
మదరాసు-14.

# ఈ పద్యాలు కంఠతా పెట్టకు!

(అర్థం బోధపడితే చాలు)

## సిగరెట్ పద్యం

ఎదురు రొమ్మున బసరెల్ల_గుదురుకట్టు
కఫము దగ్గును కొల్లగా కలుగుచుండు
మనల ఊపిరి తిత్తులు మకిల పట్టు
ముట్టబోకుడు సిగరెట్టు మోసపుచ్చు!

## చుట్ట పద్యం

గొంతుక విషమైపోవును :
చెంతకు రానీరు హితులు-చీదరకలుగున్
పంతులు దండించును బల్
వంతలు చేకూరు చుట్టవలనన్ మనకున్ ।

## పొడుము పద్యం

మెదడు చెడిపోవును-గుడ్డలు మరక వడును
ముక్కు రంధ్రాలు నల్లగా జెక్కుగట్టు
నల్లచీమిడి మూతిపై కెల్లగారు
పొడుము పీల్చుటచేత ఈ చెడుగులమరు.

—గబ్బిట సుబ్బారాయుడుశాస్త్రి (రావికంపాడు)

# ఇంట్లో నాటకం

రచన : ఎమ్. హైమవతి (ఏలూరు)

మా జ్యోతి తమ్ముడూ, సూరి, క్రిష్టయ్య, నారాయణ, ప్రభాకరం వీళ్లదో గ్రూపు మావీధిలో. మావాళ్లకు డ్రామాలు వేయడం అంటే బలే బలే సరదా- ఎలాగయినా ఆకళను అభివృద్ధి చేయ నిశ్చయించారు. క్రిష్టయ్య నాన్న డ్రాయింగు మాస్టారు కావడ చేత రంగు సీసుసున్నము ముక్కలు విరివిగా లభించేవి. వాటిని పొడిచేసి మావాళ్లు రంగులుగా ఉపయోగించేవాళ్లు. నారాయణ యింట్లో ఎవరూ ముసలమ్మలు లేకపోవడంవల్లా, నారాయణ అమ్మ, పాప, మంచిది అవడంవల్లా వాళ్ల యింట్లోని మూలచీకటి గది మా వాళ్ల డ్రామాహాల్ అయి కూర్చుంది.

ఇంక డ్రెస్సులో? వాళ్ల వాళ్ల పెద్దవాళ్ల తాలూకు పొట్టి అయిపోయి మూల పడేసిన కోట్లూ పాత కండువాలూ, చిరిగిన జంపర్లూ హాల్లోకి చేర్చారు, డ్రామా డ్రెస్సులుగా ఉపయోగించడానికి.

ఆరోజున మా జ్యోతిగాడు నాకు తెగ సహాయం చేస్తున్నాడు. మంచినీళ్లు తెచ్చిపెట్టరా వెధవా అంటే చెప్పిన గంటకు గాని ప్రత్యక్షముగాని వెధవ ఆరోజున నా పర్సనల్ అసిస్టెంటు అయిపోయాడు. ముఖము కడుక్కునేటప్పుడు నేను అడగకుండా తానే నీళ్లూ, సబ్బుబిళ్లా, తువాలూ పట్టుకవచ్చాడు. నేను డ్రాయింగు వేసుకుంటూంటే, తానే రబ్బరు పట్టుకొని "నేను చెరిపి పెడతాలే అక్కయ్యా" అని అనడం మొదలుపెట్టాడు. ఇదంతా చూస్తే వీడు ఏదో పెద్ద ప్లానులోనే ఉన్నాడని భయం వేసింది.

మధ్యాహ్నమయ్యేటప్పటికి మా జ్యోతిగాడు సేవ చాలించి అసలు విషయం తేల్చేశాడు. "అక్కయ్యా, నీవల్ల చిన్న

సహాయం పొందాలి" అన్నాడు. "ఏమీలేదు, ఎలాగయినా మనయింట్లో నాలుగు టిక్కెట్లు అమ్మిపెట్టాలి" అన్నాడు. "వార్ ఫండ్ టిక్కెట్లా" అన్నాను నేను. ఎందుచేతంటే నేను ఫస్టుఫారం చదువుతూండగా మా పంతులమ్మగారు 2 రూ. వార్ ఫండ్ టిక్కెట్టు బలవంతంగా కొనిపించారు. "అబ్బే కాదక్కయ్యా. డ్రామా కళకోసం, నీవు ఎలాగయినా నాలుగు అణా టిక్కెట్లు అమ్మిపెట్టాలి మనయింటిలో" అన్నాడు జ్యోతి. "ఎవరు కొంటారురా యింటిలో, నీకళను గురించి తెలిసిందంటే నిన్నూ నన్నూ తంతారురా జ్యోతీ!" అని కంపాస్ బాక్సులో దాచుకున్న పావలా వాడిచేతిలో ఉంచాను, ఎలాగూ తప్పదని. సంతోషంతో జేబులో వేస్తూ యింకో చిన్న సహాయం అన్నాడు. యింక కానీగూడ లేదు అన్నాను. "అది కాదక్కయ్యా మొన్న చాకలి తెచ్చిన నీచిన్న పువ్వుల చీర ఒక్కసారి కావాలి" అన్నాడు. సరేగాని నాటకం ఏమిటని అడిగాను. మావాడు లెక్చర్ మొదలు పెట్టాడు. అక్కయ్యా! "లంకాదహనం" వేద్దామనుకున్నాము. కాని మాలో ఎవడూ కిరసనాయిలు తేలేమన్నారు. అందుచేత తప్పనిసరిగా "రామరావణా యుద్ధము" వేయవలసి వచ్చింది. సాయంత్రమే డ్రామా. డ్రామాలో పెద్ద యుద్ధముకూడా ఉంటుంది, అంటూ తాను తయారు చేసుకున్న విల్లు అంబులు చూపించాడు జ్యోతి.



రాత్రి 7 గం॥ అయ్యేటప్పటికి నారాయణ యింట్లోని డ్రామాహాల్ నిండి పోయింది. నేనూ, నారాయణ అమ్మా నూరి అక్కయ్యా కుర్చీలమీద కూర్చున్నాము. రెండు గోడలకు మేకులు బిగించి వూన్చబడిన రంగు దుప్పటి ప్రక్కకు తొలిగింది. డ్రామా మొదలయింది. నూరి "సీత" వేషం వేశాడు. నా పువ్వుల చీరతో సీత లంకలో యుంది రావణాసురుని యింట్లో. "తల్లీ నిన్నుదలంచి పుస్తకము-" అని పాడి ముగించాడు నూరి డ్రామా మొదలు పెడుతూ.

ఇంతలోకే పెద్ద గడ్డితోకతో నారాయణ ఆంజనేయుడుగా ప్రవేశించాడు సీతవద్దకు, రాముని ఉంగరం యివ్వడానికి. "అమ్మా అంతా క్షేమమా," అని అడిగాడు ఆంజనేయుడు సీతను. "అంతా క్షేమమేఆంజనేయా" అనబోయి "అంతా క్షేమమే నారాయణా!" అనేసింది సీత! అందరూ నవ్వారు - సీతకుకూడ జ్ఞాపకంవచ్చి నవ్వేసింది. నూరి అక్క (నా ప్రక్కనే ఉందిగా) మతిలేని వెధవ, అని రిమార్కు చేసింది.

యుద్ధం ప్రారంభమయింది. మంచి నూడి అంబులతోనూ, విల్లులతోనూ తయారు అయారు



మావాళ్లు. రావణాసురుని అట్ట తలకాయలు బాణాల దెబ్బలు తగిలి పురి కోసవ్రాడుకు వ్రేళ్లాడుతున్నాయి. రావణాసురునికి మాత్రం అంబులు లేకుండా పెద్ద విల్లుమాత్రం యిచ్చారు.

యుద్ధం తీవ్రంగా సాగుతుంది. ఎంతసేపటికి మొద్దు ప్రభాకరంగాడు క్రింద పడటంలేదు, రాములవారి తరవువాళ్లకు విసుగు వేసింది. అంబులను ఏరి మరీ మరీగా ప్రయోగించుకుంటున్నారు యిరు ప్రక్కలవారు.

"మీా యుద్ధము పాడుగాను, కళ్లు పొడుచుకునేరు! ఇక ఆపండి వెధవల్లారా" అంటూ వెళ్లిపోయింది నారాయణ అమ్మ. యుద్ధం ఆగలేదు! రామలక్ష్మణులు తెగవేస్తున్నారు అంబులు ప్రభాకరంగాడి మీాదకు (రావణాసురుడు). పాపం! వాడికి దెబ్బలుతిని తిని విసుగు ఎత్తిందకాబోలు "ఇదుగో, రామా, నా ఆఖరు దెబ్బ!" అని క్రింద పడివున్న సూది అంబు గురి చూసి వదిలాడు రామునిమీాదకు! ఏం జరిగిందో ఏమిటో రాముడు (కిష్టయ్య) కన్ను రెండు చేతులతో పట్టుకొని "అమ్మో!" "అమ్మో!" అంటూ క్రింద పడ్డాడు. గాబరాగా అందరూ పరుగెత్తారు. లక్ష్మణుడూ (మా తమ్ముడూ) నేను యింటికి దారి తీసాము తిరిగిచూడకుండా. పది రోజులవరకూ రాముడు (కిష్టయ్య) కంటికి కట్టిన కట్టు విప్పలేదు. మావాళ్లు యిక ఎప్పుడూ కళాభివృద్ధి సంగతి మాట్లాడలేదు.

---


# బెంగాల్‌లో తెలుగు బాలలు

బెంగాల్ దేశంలో, టిటాఘర్ గ్రామంలో పిల్లెంబాడీ యందు చాలామంది తెనుగు బాలలున్నారు. అక్కడ ఒక ఆంధ్ర ప్రైమరీ పాఠశాల వుంది. ఆంధ్రదేశ తుపాను బాధితుల సహాయం కొరకు ఆ బాలలు భిక్షాటనము చేసి రూ 21-4-0లు "బాల" ఆఫీసుకు పంపించారు. ఆ పైకము సైక్లోన్ రిలీఫ్ ఫండు వారికి ఇచ్చివేయడమైనది. పిల్లెంబాడీ తెనుగు బాలలకు మా జేజేలు.

# అట్టముక్కలతో ఆట

బాలా!

అట్టముక్కలతో ఒక మజాఅయిన ఆట చెప్తాను. నేర్చుకో!
ఈ దిగువ బొమ్మలోవలె 5 చదరపు అట్టముక్కలు కత్తిరించు.




తరువాత ఒక్కొక్కటి ఎంత వెడల్పు వుందో, అందులో సగానికి మార్కు పెట్టి, ఆ మధ్యనుంచి ఒక చివరకు (బొమ్మలోలాగ) గీతగీసి, నెంబర్లు వేసి, కత్తిరించు. అప్పుడు అవి 10 ముక్కలు అవుతాయి.

ఈ పది ముక్కలూ చేర్చి ఒకే చదరంగా పేర్చగలవా! ప్రయత్నించు. తెలియకపోతే ఆఖరు పేజీలలో ఆన్సరుచూడు.

సంపాదన : ఎం. రమేశ్ కుమార్ (సికిందరాబాదు)

# పురుగుల్నీ, పక్షుల్నీ, జంతువుల్నీ అడుగు

బాలా !

ఆకాశంమీద మేఘాలు కొంచెమయినా వుండవు. అయినా, కొద్దికాలంలో వర్షం కురుస్తుందని జోస్యం చెప్పవచ్చును. అదెలాగో తెలుసా ?

పురుగుల్నీ పక్షుల్నీ జంతువుల్నీ అడుగు

## సాలె పురుగు

వర్షం కురిసేముందు సాలెపురుగు తన కాళ్లను దగ్గరగా ముడుచుకుంటుంది. తన సాలెపట్టు దారాలనుకూడా దగ్గరగా లాక్కుంటుంది.

## పావురం:

పావురాలు భూమికి దగ్గరగా ఎగురుతే వర్షం వస్తుందన్న మాట. ఆకాశంమీద పైగా ఎగురుతే, వర్షం రాదన్నమాట.

## కాకులు:

వర్షం వచ్చేముందు కాకులు మూకలుగా చేరతాయి.

## పందులు:

పందులు పొలాల్లో తిరగక, గబగబ తమ గుడిసెల్లోకి దూరిపోతాయి.

ఎడ్లు:

వర్షం వచ్చేముందు, ఎద్దులు తమ వీపుమీది వెంట్రుకలను తమ నాలుకతో పైకి ఎగనాకుతాయి.

మేకలు:

మేకలు గెంతుతూ అరుస్తాయి.

గుర్రాలు:

గుర్రాలు తమ వీపును భూమిమీద రాస్తాయి.

మిడతలు:

వర్షం వచ్చేముందు మిడతలు ఎక్కువగా అరుస్తాయి.

కప్పలు:

కప్పల శరీరం రంగు మారిపోతుంది. బెక బెకలు హెచ్చుతాయి.

కుక్కలు:

వర్షం కురిసేముందు కుక్కలు పచ్చగడ్డిని తింటాయి.

ఈగలు:

ఈగలు ఇంట్లోకి ముసురుతాయి.

నెమలి:

# చూవకనే చెప్పిన



# రామ శాస్త్రి కథ.

బబ్బిలిశెట్టి సూర్యప్రభాకరరావు (ఆముదాలవలస)

అనగా అనగా, ఒక రాజు దగ్గర రామశాస్త్రి అనే ఒక మహాపండితుడు వుండేవాడు. ఆతనికి వేదాలూ, శాస్త్రాలూ అన్నీ బాగా తెలుసును. కాని లోకజ్ఞానం ఒక పిసరంతయినా తెలియదు. ఆ రామశాస్త్రి అంటే ఆరాజుగారికి ఎంతో గౌరవం.

ఇలాగ ఆరాజుగారు ఆరామశాస్త్రిని గౌరవంతో చూడడం మిగిలిన పండితులకి కడుపు మంటగా వుండేది. ఆ రామశాస్త్రిని ఎలాగైనా ఆ రాజ్యంనుంచి వెడలగొట్టాలని వాళ్లు దురాలోచనలు చేశారు. తిన్నగా కోట ద్వారపాలకుని దగ్గరకు వెళ్లారు. వాడి చేతిలో కొంత సొమ్ము పెట్టి, రామశాస్త్రిని రాజభవనము లోనికి రానివ్వద్దని చెప్పారు. డబ్బుకి ఆశించాడు ఆద్వారపాలకుడు.

ఆ మర్నాడు మామూలుగా రామశాస్త్రి కోటదగ్గరకి వచ్చాడు. ద్వారపాలకుడు లోనికి వెళ్లకూడదని చెప్పాడు. ఎందుకని రామశాస్త్రి అడిగాడు. "మీమీద రాజుగారికి కోపంవచ్చింది. రామశాస్త్రి వచ్చినచో లోనికి రానీయకు అని రాజగారు ఆజ్ఞాపించారు" అన్నాడు ద్వారపాలకుడు. రామశాస్త్రి అదివిని చాలా దుఃఖించాడు. తిన్నగా ఇంటికి వెళ్లిపోయాడు.

నాలుగు రోజులయింది. నాలుగు రోజులై రామశాస్త్రి సభకు రాలేదు. రాజుగారు మిగిలిన పండితుల్ని అడిగారు, "రామశాస్త్రి నాలుగు రోజులై సభకు ఎందుకు రాలేదు ?" అని.

"రాజా! రామశాస్త్రికి గొప్ప జబ్బుచేసి, లేవలేని స్థితిలో వున్నాడు" అని చెప్పేశారు మిగిలిన పండితులు.

రాజుగారు వెంటనే ఒక వైద్యుణ్ణి పంపించారు. ఆ వైద్యుణ్ణి కూడా యీ పండితులు లోబరచుకొని అబద్ధాలు చెప్పమన్నారు. వైద్యుడు తిరిగివచ్చి "మహారాజా! రామశాస్త్రికి చాలా పెద్ద జబ్బుచేసింది. కుదరడం కష్టమే!" అని చెప్పేశాడు.

రాజుగారికి జాలి వేసింది. పాపం, రామశాస్త్రిని తానే స్వయముగాచూద్దామని బయలు దేరాడు.

ఈ సంగతి కని బెట్టుతున్న పండితులు గబగబ అడ్డుదారిని పోయి, రాజుగారికి ఎదురుగా వచ్చి, ఏడుస్తూ "మహారాజా! రామశాస్త్రి ఇప్పుడే చనిపోయాడు. మేము అక్కడనుంచే వస్తున్నాము" అని చెప్పారు.

"అయ్యో పాపము! రామశాస్త్రి చనిపోయాడా! పోని, ఆఖరికి వానిశవమేనా చూస్తాను" అంటూ బయలుదేరాడు రాజు.



ఇంతలో యీ పండితులు, "మహారాజా! సార్వభౌములు శవమును చూడకూడదు. మహా పాపము" అంటూ రాజుగారిని వెనుకకు మరలించారు.

ఇలా కొన్నాళ్లయాక, రామశాస్త్రికి యీ సంగతి అంతా తెలిసింది. రాజుగారిని ఎలాగైనా కలుసుకొని తన విషయం చెప్పుకోవాలని అనుకున్నాడు.

రాజుగారు సాధారణంగా

షికారునుండి వచ్చు తోవలో రామశాస్త్రి ఒక చెట్టు వెనక కూర్చున్నాడు. రాజుగారు, కొందరు పండితులతో ఆదారినే వస్తూవుండగా రామశాస్త్రి గబాలున ఎదురై "మహారాజా! నేనే రామశాస్త్రిని! నేనే రామశాస్త్రిని!" అంటూ కేకలు వేశాడు.

పండితులు, "మహారాజా! వీడు రామశాస్త్రి కాడు. బ్రహ్మరాక్షసి! రామశాస్త్రి చనిపోయి పిశాచి అయాడు!" అంటూ భయపెట్టి, రామశాస్త్రిని నాలుగు తన్ని తరిమేశారు.

రామశాస్త్రి తన ప్రాణాలు దక్కించుకోడానికి పారిపోయి, పాపం, ఆఖరికి ఆదేశం విడిచి పోయాడు.

చూశారా! కుట్రవలన కొందరు ఎన్నన్ని పనులు చేస్తారో!




## ఏడుపు!

విమలకి ఒక చిన్న చెల్లాయి వుంది. చెల్లాయి పేరు అన్నపూర్ణ. ఒకనాడు విమల తన చెల్లాల్ని ఒళ్లో పడుకోపెట్టుకొని బారున రాగాలుతీసి ఏడుస్తోంది.

అప్పుడు వాళ్ళమ్మ: "అదేమిటే విమలా! శుక్రవారం పూటా అలాగ ఏడవవచ్చునా! ఎందుకలా ఏడుస్తావూ! ఏమిటికావాలి!" అంది.

"అదికాదే అమ్మా! రేపు మాబడిలో డ్రామాలో నాకు ఏడ్చే తల్లివేషం ఇచ్చారే! నా పోర్షను రిహార్సిలు చేసుకుంటున్నాను!" అంది విమల.

# తమాషాల గాడి తమాషా

బి. నా. మూర్తి బి. ఎస్. సి. డి. ఇ. డి.

రోజుకిలాగే నేను, సూబుచ్చి బాబు, తమ్ముళ్లూ మా తమాషాలుగాడు పైరు బయలు దేరాం. తమాషాలుగాడి అసలు పేరు మాకు సరిగా తెలీదు. వాడిని "తమాషాలుగాడు" అని పిలవవచ్చునో లేదో ఈకథ చదివి మీరే చెప్పండి. అలాగ్గా తిరిగి, తిరిగి వస్తుంటే తోవలో మావూరి నాయుడుగారి చెరుకు తోట కనిపించింది. చెరకుగడలు చాల ఏపుగా పెరిగి ఉన్నాయి. వాటిని చూడ్డంతోనే మా అందరికీ అవి తినాలని బుద్ధిపుట్టింది. కాని అదివీలుకాలే! మావూరి నాయుడుగారు ఎవ్వరిని ఆప్రక్కకన్నెత్తి చూడనైనా చూడనివ్వడు. ఆతోట ప్రక్కనే నాయుడుగారి కొడుకు గానుగ కూడ ఉన్నది. మేమందరము మా తమాషాలగాడిని ఎప్పుడైనా చెరుకు గడలు సంపాదించమని బ్రతిమాలాము. ఆఖరికి ఎలాగైతేనేమి 'సరే' అన్నాడు. అందరము కలసి తోటవైపు బయలు దేరాము. మేమింకా గేటు దగ్గరకు వెళ్లకముందే నాయుడుగారి కేక వినిపించింది.

"ఎవరా వచ్చేది! ఆగండి! ఆగండి!"

"మేము! మేము" అని అరిచాడు మావాడు.

"ఎవరు మీరు? రావడానికి వీలులేదు" అంటూ మా దగ్గరకు వచ్చాడు. వచ్చి, "ఎవరయ్యామీరు! ఏం పని మీకు!"

"మరేంలేదు నాయుడు గారు" అని అందుకున్నాడు తమాషాలగాడు. "మీ ఎద్దుకి మీదిపళ్లు ఉన్నాయా!" అని అడిగాడు.

బాలలూ! ఎద్దులకి, ఆవులకి మీద దవడలో పళ్లు ఉండవని మీకు తెలుసుకదూ!

"మా ఎద్దుకి మీదిపళ్లేమిటయ్యా! ఎక్కడైనా ఎద్దుకి మీదపళ్లు ఉంటాయా!"

"అద్దీ తమాషా!" అన్నాడు మాభీరడు. "మీ ఎద్దుకి నేను మీదిపళ్లు చూపెట్టుతాను పద."


"నీకేం మతిపోయిందయ్యా! నడు, నడు!" "అదికాదయ్యా! నిజంగా మీఎద్దుకి మీదిపళ్లు చూపిస్తాను. చూపెట్టితే మాకు చెరుకు గడలు ఇస్తావా?"

"అలాగే! కాని చూపెట్టక పోతే వీపు చిదుకకొట్టుతాను ఏం? సరేనా?"

"ఓ! అలాగే! అయితే ఎవరినైనా పెద్ద మనుష్యులను మధ్యవర్తిగా పిలు."

"సరే! మా పాలికాపు ఉన్నాడు" అంటూ నాయుడు గానుగడగ్గరికి దారితీసాడు. మేం కూడ అతని వెనకాలే వెళ్తున్నాము. కాని మాకందరకు గుండెలు దడదడ కొట్టుకొంటున్నాయి, వీడు ఎద్దుకి మీదిపళ్ళు ఎలా చూపెట్టగలడు? అసంభవము దేముడే వాటికి పళ్ళు ఇవ్వలేదు. వీడు ఎలా చూపించగలడు. అనవసరముగా దెబ్బలు తినాలే అనుకుంటున్నాము. ఇంతలో నాయుడు ఒక ఎద్దుని తెచ్చి తమాషాలుగాడి ముందర పెట్టేరు "చూపయ్యా! చూపు" అంటూ.

"అలాగే! అందరూ బాగా చూడండి" అంటూ తమాషాలగాడు ఎద్దుదగ్గరికి వెళ్లి, తన మీదపళ్ళు ఎద్దుకి చూపెట్టుతూ"



...ఇహీ! ఇహీ! అని నవ్వడం మొదలు పెట్టాడు.

"ఏమిటయ్యా అది! ఎద్దుకు మీాదిపళ్ళు చూపెట్టవేం! అరి చాడు నాయుడు.

"ఇదిగో! నీ ఎద్దుకి నా మీాదిపళ్ళు చూపెట్టుతున్నాను చూడు. నేను ఏమని చెప్పాను. ఎద్దుకి మీాదిపళ్ళు చూపెట్టు తాను అన్నాను. ఇదిగో చూపెట్టుతున్నాను" అంటూ తిరిగి తన మీాదిపళ్ళు చూపెట్టాడు!

మే మందరము ఆ తమాషాకి కడుపుబ్బ నవ్వడం మొదలు పెట్టాము. నాయుడుగారు కూడ మొదట కొంచెం తెల్లబోయి కోపం తెచ్చుకున్నా తరువాత తమాషాలగాడి చాతుర్యానికి సంతోషించాడు.

ఇంకేం! మా కందరకూ తిన్నన్ని చెరుకుగడలు, తాగి నంత చెరుకురసం దొరికింది!


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

యీయండి.

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీాకే తెలియగలదు.

వివరములకు:

డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు అండ్ బ్రదర్సు.

11 దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు,

| కుంభకోణం బ్రాంచి; | తిరుచినాపల్లి బ్రాంచి; |
|---|---|
| నెం. 7, సారంగపాణి కోవిల్ | నెం. 15, పుగళైషిక్కై వీధి, |
| తూర్పువీధి. | తెప్పకొలం |



(గొలుసుకథ)

ముందు కథ:—[శంకర్, లలిత క్షత్రియులబిడ్డలు. మంచి ధైర్యవంతులు. ఒకనాడు వాళ్ల అవ్వ చెప్పింది: త్ర్యంబక దుర్గాల్లో ఎక్కడో ఒక రహస్యస్థలంలో తమ ముత్తాతలు దాచిన ధనం కుప్పలుగా వుందని. ఆరాత్రే శంకర్, లలిత, వాళ్ల స్నేహితుడు చంద్రం బయలుదేరారు. మర్నాటి ఉదయానికి ఒక అడవిలో మకాం చేశారు—ఇక్కడ ఇలావుండా—ఇక వీళ్ల వూళ్లో—]

శంకర్ వాళ్లవూళ్లోనే రణమల్లు వీరమల్లు అని యిద్దరు వున్నారు. వీళ్లిద్దరు పగటిపూట సామాన్య వర్తకులుగా వుంటూ వుంటారు. కాని రాత్రిళ్లు దార్లు కాచి దోపిడీ చేస్తూంటారు. ఆరోజుల్లో రైళ్లు విమానాలూ లేవు. వూరికీ వూరికీ మధ్య అడవులు వుండేవి. అందుచేత ప్రయాణీకులు నడిచో బండిమీదో వెళ్తూవుండేవారు. ఈ దొంగల్కి దోపిడి చాల సులభంగా వుండేది.

శంకర్, లలిత, చంద్రం పారిపోయిన మర్నాటి పొద్దున్న వాళ్ల తాత అవ్వ గొల్లుమని యేడ్చారు. తాత మూర్ఛపోయాడు. రణమల్లు వాళ్లని ఓదార్చి సంగతేమిటని అడిగాడు. అవ్వ జరిగిన సంగతి చెప్పింది. రణమల్లు ఆమెకి ధైర్యం చెప్పాడు. "అవ్వా! ఆదారి నాకు చెప్పు, నేను వెళ్లి వెతికి పిల్లల్ని తీసుకువస్తా" అని. అవ్వ జ్ఞాపకం చేసుకొని తనకి తెలిసిందంతా చెప్పింది. రణమల్లాదారి గుర్తించుకుని వీరమల్లుని తీసుకుని బయలుదేరాడు.



వీరమల్లుకి యిది బొత్తిగా యిష్టంలేదు. "రణమల్ల్! యిదంతా తాడు బొంగరంలేని విషయం. ఆ అవ్వ చెప్పిన దారి కొంతమట్టుకూ వుంటె మరి తర్వాతో? ఎంతకాలం నుంచీ సంపాదించిన డబ్బు చాలక దురాశతో బయలుదేరాం. ఈ అడవిలో చస్తే యేం కాను. ఇదంతా అనవసరం." అంటూ దారి పొడూగ్గా వొద్దంటూనే వున్నాడు వీరమల్లు. రణమల్లుకి విసుగెత్తింది. "వీరమల్లు! నన్ను విసిగించక పీకకోసినట్టే మాటలతో-నువ్వు వచ్చితీరాలి. ఇదు

గో యీ కాగితంచూడు అంతా తెలుస్తుంది." అంటూ తన జేబులోంచి ఓకాగితం తీసి వీరమల్ కి యిచ్చాడు.

సూర్యుడస్తమించాడు. ఆతను చీకట్లోనే వీరమల్ మార్గదర్శిని దీక్షతో చూస్తున్నాడు.

గబుక్కున అరిచాడు రణమల్ - సంతోషంతో "యిదుగో మహా వటము. ఆ అవ్వ చెప్పింది. ఈ చెట్టుకి యీశాన్య దిక్కుగా ఆరుమైళ్లు వెళ్తే కొండలో ఒక కాళికాదేవి గుడి వుంటుందని."

ఇంతలో "ఆఁ!" అని గుండెలు పగిలేలా అరుస్తూ ఓ పెద్ద


గోతిలో యిద్దరూ పడ్డారు.

ఇంక తాతకి తెలివి రాగానే అవ్వ చెప్పింది. 'పిల్లల్ని కోతికి తెమ్మని రణమల్లుని పంపాను' అని. తాత లబో దిబో అని మొత్తుకున్నాడు, "అయ్యో! ఆదారెందుకు చెప్పావే! వాడసలే బందిపోటు, డబ్బు దొరికిందంటే పిల్లల్ని యేంచేస్తాడో" అని. "ఏమో! నేనంత దూరం ఆలోచించ లేదంది" అవ్వ బరువుగా. అనుకోకుండా యిద్దరు ఒక్కమాటే, "కాళీమాతా! నీపాపల్ని చూసుకో" అన్నారు.

అక్కడ ఆదొంగ లిద్దరూ గోతిలో పడ్డారా—ఇక ఇక్కడ చూద్దాం.

"అన్నయ్యా! అన్నయ్యా" అని విరగబడి నవ్వుతూ శంకర్ ముందు కూలబడింది లలిత. "అన్నాయ్! మరేం నేనేగాని యివ్వాళ లేకపోతే చంద్రం పని యేమయి వుండేదో! హాహ్హాహ్హా!"

ఇంతలో "శంకర్ మరేం—" అంటూ ప్రవేశించాడు చంద్రం.



"ఆఁ! నేచెప్తా! అన్నాయ్! మరేం మేమిద్దరం అలావెళ్లి ఓ చెట్టెక్కాం. ఇంతలో ఓముళ్లపంది వచ్చింది. 'నేను దాన్ని చంపనా' అంటూ చంద్రం బాకు విసిరాడు. దానికో కన్నుపోయింది. అదేం చేసిందో తెలుసా! చచ్చిపోయినట్లు పడుకుంది. అప్పుడేం—అని కడుపు చెక్కలయ్యేట్లు నవ్వ మొదలు పెట్టింది.

"ఆఁ! యేముందిలే నేదగ్గిర కెళ్లా...అది తిరగపడ్తే..." అని చెప్పియ్యబోయాడు చంద్రం. లలిత మధ్యలోనే అందుకుని అరిచింది. "అంతట మహావీరుండగు యీ రెండవ బాలచంద్రుడు పారిపోయె."

"నువ్వమాత్రం పారిపోవా యేం?" చంద్రం దెప్పాడు.

"నేనప్పుడు చెట్టు వూడ పట్టుకుని వూగి ఆపంది రెండవ కన్ను పొడిచేసా...అంత ధైర్య సంపన్నుండగు నా చంద్రుండు వెనుక వెనుకనే వచ్చి ఆగ్రుడ్డి పంది నెదుర్కొని దాగుడు మూతల పోరు సలిపి దానిం జంపె!" ఏదో ధోరణలో పోతూంది లలిత.

"హుష్! వూరుకో చెల్లాయ్ తప్పుకాదూ" అంటూ మందలించాడు శంకర్.

"ఇంత దండకం అప్పగించక పోతే నేను చాలా బలవంతు రాల్ని అని చెప్పకోకూడదూ!" అన్నాడు చంద్రం ఉక్రోషంతో.

"చంద్రం అది చిన్నపిల్ల పైగా, పెంకిది...దాని మాటల కేంగాని..."

"మీరు మహా పెద్దవాళ్లలా వుంది...ఇంతోటి మొగాళ్లు పందిని చంపలేని..." అని కడుపు చేత్తోపట్టుకొని నవ్వటం ప్రారంభించింది లలిత.

"లలితా!" అని గద్దించాడు శంకర్. ఎప్పుడూ యెరగనంత కోపాన్ని అన్న మొహంలో చూడగానే గాలివానకు రావాకుల్లా కంపించి పోయింది లలిత.

"మొన్నరాత్రి బయల్దేరాం. ఇవ్వాళ సూర్యాస్తమయం అవుతూంది. ఇంతవరకు యేమీ ఆశలులేవు. ఇక్కడ తిని కూర్చోడం తప్పితే...ఇలాపోతే ఓపెద్ద మర్రిచెట్టుట. దానికి ఈశాన్యంగా మళ్లీ పోవాలట. ఆచెట్టెంత దూరమో...ఎక్కడేం చిక్కులో...మీరేమో గిల్లి కయ్యాలు పెట్టుకుని అల్లరి చేస్తారు. మీకు బుద్ధి చెప్పటానికి నేనుమాత్రం మహా పెద్దవాణ్ణి!" అంటూ శంకర్ సాదించాడు.

లలితా చంద్రం తలలువాల్చారు.

"మీరు మౌనంగా వుంటే యెలాగా! మీ ఆలోచనేమిటో చెప్పండి?" అని హెచ్చరిం

చాడు శంకర్. "చెప్పవాసికే ముందోయి, వెన్నెల రాగానే బయల్దేరుదాం...ఆఁ! అవును గానీ రాత్రిళ్లు దొంగలు..." అంటూ నసిగాడు చంద్రం.

"దొంగలా! దొంగలే!... దొంగలు!" అంటూ గుటకలు మింగింది లలిత.

శంకర్ నవ్వాడు, అడవిలో మనం వస్తామని కాచుకు కూర్చుంటారేం దొంగలు... అయినా మనం యిక్కడే జడుస్తే యెలాగా ... సంపాదించబోయే ధనరాముల చుట్టూ యెన్ని గండాలు ఉంటాయో!

లలిత యేడుపు మొహం వేసింది "అన్నయ్యా మనకైతే చెట్లు దూకటం వచ్చుకాని గుహాల్లో చీకట్లో యెవరితో యెలా దెబ్బలాడాలో మనకు తెలుసు?" అంది. చంద్రం ఆమెను బలపరచాడు. "అవునోయ్ శంకర్ మనం యింటికి వెళ్లిపోదాం వెళ్లి—" "ఛీ!" అన్నాడు శంకర్. "నేనురాను మీరు పొండి. అసలు ముందె చెప్పా చావుకి సిద్ధమైతేనే గుట్ట యెక్కండని" మా వంశంలో తప్పి పుట్టారు. పది నిమిషాలు నిశ్శబ్దం. లలితంది, అవును అందరూ నవ్వుతారు. సిగ్గు సిగ్గు. బలవంతంగా గొంతు పెగల్దీసుకొని చంద్రం పెదవులు మెదిపాడు. "అవును నిజమె అలాటి సిగ్గుచేటు చావుకన్నా యీ అడవిలో దొంగలచేత చావుపోటే నయం" అని. లేవెలుగులో శం




కర్ ముఖం ఆనందంతో వెల్లి విరిసింది. ఆ వెలుగు లలితా చంద్రుల ముఖాల్లో ప్రతిఫలించింది. "చంద్రోదయం దాకా యెందుకు యివ్వాడె పోదాం" అంది లలిత ఉత్సాహంతో.

లేడికి లేచిందే పరుగు. పిల్లలి మనస్సుతో పరుగెత్తాయి గుఱ్ఱాలు.

చెప్పటం మర్చిపోయాను లలితకి! ఓ మంచి తెల్లటి పెంపుడు పిల్లి వుంది. దాని పేరు లీల. ఇప్పుడు లీల యెక్కడుందో తెల్సా- లలిత వీపున కట్టుకున్న సంచీలో వుంది. పాపం! కడుపుకి విసుక్కుంటూంది. ఆ రాత్రంతా గుఱ్ఱాలు పరుగెత్తుతునే వున్నాయ్. తెల్లవారుతూంది. "అదుగో మర్రిచెట్టు" అంటూ అరిచాడు శంకర్. రౌతుల ముఖాలు వికసించాయ్. మందంగాపోయె గుఱ్ఱాల్ని పురిగొలిపారు. తన పెంపుడు పిల్లివున్న సంచీ దిగజారుతూంటే కొంచెం పైకి లాక్కుంది లలిత. ఈసర్దుపాటులో పదిగజాలు వెనకై పోయింది లలిత.

శంకర్ చంద్రుల అరవులతో త్రుళ్లిపడింది లలిత. అంతే! తను కూడా ఓ కేక వేసింది! అంతలోనే పైనించి వేళ్లాడే వూడలు పట్టుకొని వేళ్లాడింది. ముందు శంకర్ చంద్రం వాళ్ల గుఱ్ఱాలు వెనక్కాలె తన గుఱ్ఱం అంతా అఘాతమైన గోతిలో పడిపోయారు. చెట్టుపై కొమ్మలమీద దాంకొని క్రిందకి చూసింది... అది దొంగనేల! గోతిమీద తడకవేసి మన్ను చల్లారులాగుంది. అయితే అన్నా చంద్రం యింక రారు...ఇంక రారు! గట్టిగా యేడ్వబోయింది. గొంతు ఏడలేదు.

తరువాత ఏమైయిందో? ఒచ్చేనెల 'బాల'లో చూడండి.



# కుమ్మరి ఇంట్లో

# కొంటె పిల్లలు!

* * మోకం సరోజమ్మ (గుత్తి) * *

కడప గ్రామం మట్టితో చేసిన కూజాలకు, బానలకు చాలా ప్రసిద్ధి. వేసవికాలంలో యీ కుండల్లో నీరుపోసి వుంచితే బహుచల్లగా ఉంటాయి.


కుమ్మరి యల్లప్ప వీటిని తయారు చేయటంలో మంచి నేర్పరి. ఇతడు మట్టితోనే విగ్రహాలుకూడా బహు అందంగా తయారు చేస్తాడు.

ప్రతిదినము కోడికూతతో లేవటం, ప్రొద్దు పొడిచేంతవరకు కొన్ని కుండలు చేయటం, తన కొట్టంలో ఆరబెట్టి, పనులుమీద పొలాలకు వెళ్ళటం, ఇది అతని దినచర్య.

అతని కొట్టానికి సమీపంలోనే ఒక పాఠశాల ఉండేది. బళ్లో పిల్లలెక్కువే కాని, చదువు తక్కువ. అల్లరి పిల్లలంతా అస్తమానం బయట ఆడుకునేవాళ్లు. ఒకరోజు కుమ్మరి కొట్టంలో ఆరబెట్టబడిన పాత్రలు వీరికంట పట్టాయి. కుమ్మరిలేని సమయం చూచుకొని కొట్టంలో ప్రవేశించారు. తలొకటి చేతపుచ్చుకొని కోతుల్లా పరీక్షిస్తూ నేలకు విసిరి కొట్టి ముక్కలుచేసి పరుగెత్తిపోయారు.

సాయంత్రం యల్లప్ప యింటికొచ్చాడు. కుండలన్నీ ముక్కలయినాయి! ఎన్నడూ జరగని యీ సంఘటనకు ఆశ్చర్యపోయాడు. ఎవరు యిలాచేసి వుంటారా అని చాలా తర్కించుకున్నాడు. కాని, ఏమి తోచలేదు.

మరుసటిరోజు యల్లప్ప పాత్రలుచేసి, కొట్టంలో ఆరబెట్టి పొలం వెళ్ళాడు. సాయంత్రం




వచ్చి చూచేటప్పటికి కుండలన్ని ముక్కలయినాయి. ఆరోజు మరింత తీవ్రంగా యోచించాడు. కాని కారణం తోచలేదు.

ఇలా వారం పదిరోజులు గడిచినాయి. ప్రతిదినము చేసిన పాత్రలన్ని ముక్కలయిపోతున్నాయి. కలుగుతూవున్న నష్టానికి చాలా చింతించాడు. ఈ దుర్మార్గులను ఎలా పసికట్టాలన్నది యల్లప్పకు పెద్ద సమస్య అయింది.

కడపటికి అతనికి ఒక ఉపాయం తోచింది. తన విగ్రహాన్నొకటి తయారుచేసి కుండల దగ్గరగా గుమ్మంలో నిలువబెట్టి తన పనులమీద వెళ్ళాడు.

కొంటె కుఱ్ఱాళ్ళు మామూలుగా అల్లరిచేస్తూ గుడిసెలో ప్రవేశించాలని వెళ్ళారు. బొమ్మనుచూడగానే నిజంగా కుమ్మరి అక్కడ ఉన్నాడని భయపడి కాళ్ళకు బుద్ధిచెప్పారు.

సాయంత్రం కుమ్మరి యింటికొచ్చాడు, ఎలావున్న కుండలు అలాగే ఉన్నాయి. తన ఉపాయం చాలాబాగా పనిచేసిందనుకున్నాడు.



అనుకొని ఆడుకుంటున్నారు. కొయ్యబొమ్మను కొట్టినా పలుకదన్నట్లు, జవాబురాలేదు. వారిలో ఒకడు బొమ్మవైపు దీర్ఘంగా చూస్తూ రహస్యం బయట పెట్టాడు. యల్లప్ప చేసిన ఉపాయానికి తమకోపాన్నంతా కుండ మీద తీర్చుకున్నారు కుఱ్ఱవాళ్ళు.

కొన్ని రోజులు గడిచినాయి. ప్రతిదినము కొంటె కుఱ్ఱవాళ్ళు కొట్టంలో ప్రవేశించి కుండలు బద్దలు చేయాలనుకున్నారు. కాని, విగ్రహాన్ని చూచి కుమ్మరి కావలి కాస్తున్నాడని భయపడి పారిపోయేవారు.

ఒకరోజు యీ అల్లరిమూక అంతా యల్లప్ప కొట్టానికెదురుగా ఆడుకుంటూ వుండినారు. ఉన్నదున్నట్టు వాళ్ల బంతి కుమ్మరి యల్లప్ప కొట్టంలో వెళ్ళి పడ్డది. పిల్లలంతా వెళ్ళి, 'ఏమయ్యో! మాబంతి మీకొట్టంలో పడింది. కాస్త తీసియివ్వరాదా!' అని విగ్రహాన్ని చూస్తూ మనిషే

సాయంత్రం యల్లప్ప యింటి కొచ్చి చూడగా కుండలన్ని ముక్కలయినాయి. రహస్యం బయటపడిందనుకున్నాడు. రోజూ తనకు కలుగుతూ వున్న నష్టానికి మండిపడ్డాడు. ఎల్లాగయినా దుండగులను పట్టుకొని తీరాలని నిశ్చయించుకున్నాడు.

ఒకరోజు విగ్రహానికి బదులు తానే విగ్రహంలా కదలక మెదలక నిల్చున్నాడు. అది విగ్రహమే అనుకొని కొంతమంది కుఱ్ఱాళ్ళు లోపల ప్రవేశించారు. కొందరు విగ్రహాన్ని బట్టి ఊగించి లాగారు. యల్లప్ప వెంటనే తన దుడ్డుకఱ్ఱతో నాలుగు బాది



నాడు. దిక్కు లేదురా కంబగిరియని, చస్తిమిరా బాబూ అంటూ నిలువకుండా పరుగెత్తారు.

లోపల దూరినవారు పరుగెత్తలేక పోయారు. యల్లప్ప వాళ్లనందరిని బంధించి బాగా బాదినాడు. ఒక్కొక్కరిని వెయ్యేసారులు కూచోబెట్టి నుంచోబెట్టాడు. మరల యిలాంటి కొంటెపనులు ఎక్కడయినా చేస్తారాఅని కుమ్మరి అడిగితే బాబూ! యిక మా జన్మలో చేయమంటూ తమ రెండు చేతుల్తో కళ్ళనీళ్ళు, ముక్కు చీమిడి తుడుచుకుంటూ వెళ్ళిపోయారు.

ఆనాటినుండి కుమ్మరి యల్లప్ప కొంటెపిల్లలకు సింహ స్వప్నం.


## పుట్టింరోజులు

మీ పుట్టింరోజు పండుగకిగాని, మీ ఇంట్లో పెళ్లి పిలుపులకుగాని శుభలేఖలు మొదలగునవి, బాలా ప్రెస్సులో చక్కగా అచ్చువేసి యీయబడును. కొత్త టైపులు-అందమైన అచ్చు.

ఆఫీసు: 170. రాయపేట హైరోడ్డు మదరాసు-14.

# ఎవరు దేవత? ఎవరు రాక్షస?

మూరిశెట్టి జీవరత్నరావ్ (అనకాపల్లి)

అనగా అనగా ఓవూళ్లో ఒక లక్షాధికారి వుండేవాడు. అతనికి కొడుకులుగాని కూతుళ్లుగాని యెవ్వరూ లేరు. తనడబ్బు ఖర్చుపెట్టడ మెలాగో తెలియని పరిస్థితి కొచ్చాడతను. ఓమారు ఒక చిత్రకారుణ్ణి పిలిపించాడాయన, అతనికి కావలిసినంత డబ్బిచ్చాడు. ఆడబ్బుకి బదులుగా యేం కావాలన్నాడో తెలుసా! మనిషిని చూడగానే అమాయకుడని తెలిసే వాడి ఫోటో ఒకటి గీసి యిమ్మన్నాడు. సరేనని అమాయకుల వేటకోసం బయల్దేరా డా చిత్రకారుడు. ఎవరిని చూసినా అమాయకుడనే బుద్ధి కలగడం లేదతనికి. తిరిగి తిరిగి అలసిపోయాడు పాపం! అదే సమయానికి అతనికి పదేళ్ల బాలుడొకడు కనబడ్డాడు. ఆ బాల మొహమే చెప్పేస్తోంది అతడు అమాయకుడని. భేష్! బావుందనుకుని వెంటనే అతని బొమ్మ గీసి యిచ్చాడు. ఆ బొమ్మని చూసి యెంతో మెచ్చుకున్నాడతను.

ఆ బొమ్మకింద "దేవత" అనే అక్షరాలు వ్రాయించి ఆ పటాన్ని యింట్లో వ్రేలాడ గట్టించాడు.

ఇలా పదిహేనేళ్లు గడిచినయ్. మళ్లీ చిత్రకారుణ్ణి పిలిపించాడు లక్షాధికారి. మనిషిని చూసీ చూడడంతోనే దుర్మార్గుడనిపించేవాడి ఫోటో ఒకటి గీసి యిమ్మన్నాడు.

జైలు దగ్గరకుపోతే మనకావాల్సినవాళ్లే వుంటారని బయల్దేరాడు మన చిత్రకారుడు. వెతికి వెతికి గడ్డాలూ, మీసాలూ బలసిపోయి నల్లగా దొంగకి మల్లేవున్న ఒక్కైదీని చూసాడు. ఇతని బొమ్మయితే తన అభిప్రాయంతో సరిపోతుందనుకుని అతని ఫోటోగీసి యిచ్చాడు లక్షాధికారికి. ఆ ఫోటో క్రిందనే "రాక్షస" అనే అక్షరాలు వ్రాయించి "దేవత" ఫోటో ప్రక్కనే వ్రేలాడ గట్టించాడు.

అసలే లక్షాధికారి. అతనికి స్నేహితులకే కొదవా? జిల్లా






క లెక్టరు మొదలుకొని పోలీసు యిన్స్పెక్టరు వరకూ అతని స్నేహితులే! ఓమారు జైలు సూపరెండెంటు మన లక్షాధికారి యింటికి రావడం తటస్థించింది. ప్రక్క ప్రక్కనే వ్రేలాడుతూన్న "దేవత" "రాక్షస" ఫోటోలను చూసి ఏం? వీటి నెందుకిలా వుంచారు? అని అడిగాడు. మరేమీ లేదు. బొమ్మ చూడడంతోనే అమాయకుడని తోస్తోంది గాబట్టి "దేవుడు" అనీ ఫోటో చూడడంతోనే దుర్మార్గుడనిపిస్తోంది గనుక "రాక్షసుడు" అనీ రాయించి వ్రేలాడగట్టించాను అని జవాబిచ్చాడు లక్షాధికారి. జైలు సూపరెండెంటు యిలా చెప్పడం మొదలెట్టాడు.

"ఈ రెండూ ఒక్కరి ఫోటోలే. ఈ అబ్బాయి నా స్నేహితుడైన ఓ ప్లీడరుగారి కొడుకు. చిన్నప్పుడెంతో బుద్ధిగా

వుండేవాడు. పెద్దవాడవుతూన్న కొద్దీ దొంగతనం చెయ్యడం, త్రాగడం, దోపిడీ చెయ్యడం మొదలైన దురభ్యాసాల కలవాటుపడ్డాడు. ఓసారి ఒకణ్ణి ఖూనీ చేసాడుకూడా! అంచేత యిప్పుడు జైల్లో పెట్టబడ్డాడు. అతని యిప్పటి రూపమే "రాక్షసుడు" అన్నాడు.

ఆశ్చర్యపోయాడా లక్షాధికారి. దురలవాట్లవల్ల యెంత ముప్పొస్తోందో గ్రహించి ఆ బొమ్మల్ని గీసిన చిత్రకారుడికి తన ఆస్తినంతట్నీ రాసియిచ్చేసాడు.

చూశావా బాలా? అలాంటి అలవాట్లవల్ల యెంతలో యెంత మోసొచ్చిందో!


## వీ రెవ రు?

1. ఆంధ్ర కేసరి
2. దేశబంధు
3. దేశభక్త
4. దేశోద్ధారక
5. కవికోకిల
6. నేతాజీ
7. బాపూజీ

తెలుస్తే సరి. తెలియకపోతే ఆఖరు పేజీలలో జవాబులు చూసుకో.

చింతామురళి కిషన్ రావు (ఖమ్మం)

## ఏ బీ సీ డీల దొర!




కూర్పు: ఎ. శ్రీలత (మద్రాసు)

# మేలైన కర్పూరం

గత యుద్ధం ఆరంభమైనప్పటినుంచి, మేలురకపు కర్పూరం బజారులలో సరిగా దొరకడంలేదు. అయితే ప్రసిద్ధిపొందిన వ్యాపారస్తులు మాత్రం మంచికర్పూరాన్ని ఎలాగైనా సంపాదించి అమ్ముతున్నారు. మంచికర్పూరం కావాలంటే

**'గడియారం మార్కు కర్పూరం'** అని అడగండి.

గడియారంమార్కు కర్పూరం అన్నిషాపులలోను దొరుకుతుంది.

లేదా, యీ క్రింది అడ్రసుకు వ్రాయండి.

## గోపాల్‌జీ చాంపషీ అండ్ కో.,

30, గోవిందప్పనాయక్ వీధి, • • జి. టి. మదరాసు.





# కోతుల రామాయణం.

—యల్. నాగయ్య (తాడిపత్రి)

అనగా అనగా ఒక పట్నంలో ఒకపేద బ్రాహ్మణుడుండే వాడు. ఆ బ్రాహ్మడికి ఇంటి నిండా బోలెడు పిల్లలు. ఉద్యోగం అసలే లేదు. ఆదాయం సున్నా!

ఆ బ్రాహ్మడికి రామాయణం చదవడం వచ్చును. ప్రతిరోజూ వూళ్లో ఇక్కడా అక్కడా రామాయణం చదివేవాడు. అందరూ వినేవారేగాని ఒక్క రాగికానీ ఇచ్చేవారు ఒక్కరూ లేరు.

ఆ బ్రాహ్మడి భార్య బహు ఉత్తమురాలు. ఇంట్లో దమ్మిడీ లేకపోయినా, కోమటి కొట్లో అప్పో సప్పో చేసి ఇల్లు గడుపుతూ వుండేది. ఇలా ఎంతకాలం జరుగుతుందీ? అప్పు ఇస్తున్న సెట్టిగారు ఒకనాడు వచ్చి "ఏవండీ! మీకు ఇకముందు ఏసామాన్లూ అరువు ఇవ్వను. నాకు రావలసిన బాకీక్రింద మీ ఇల్లు తనఖా రాయండి" అంటూ కేకలు వేశాడు.

అప్పుడు ఆ బ్రాహ్మడి భార్య ఆ సెట్టిగారిని బ్రతిమాలి, కొద్ది రోజులు గడువు అడిగింది. సెట్టి సరే అని వెళ్లిపోయాడు. తరువాత ఆ బ్రాహ్మడి భార్య బ్రాహ్మడితో ఇలా అంది. "ఏవండీ! మీరు ఈవూరు విడిచి పొరుగూరుకేనా వెళ్లి రామాయణం చదవండి. ఈ పట్నంలో మీ రామాయణం వినేవారు లేరు. పల్లెటూళ్లలో చదివితే మీకు నాలుగు రూపాయిలు దొరుకుతాయి. ఎలాగైనా కొంత ధనం సంపాదించి తెండి. ఈ సెట్టి అప్పు తీర్చేద్దాం!" అంటూ భర్తని ప్రయాణం కట్టింది.

మన బ్రాహ్మడు "హా రామచంద్రా!" అంటూ ఆ రామాయణం పుస్తకం పట్టుకొని బయలుదేరాడు. ఊరువిడిచి అడవుల దారిని వెళ్లాడు. తోవలో ఒక చోట ఆంజనేయస్వామి గుడి కనిపించింది. ఆగుడిదగ్గర అలసట

తీర్చుకుందుకు బసచేశాడు మన బ్రాహ్మడు.


ఎదురుగా ఆంజనేయ విగ్రహం చూడగానే మన బ్రాహ్మడికి రామాయణం జ్ఞాపకం వచ్చింది. సరే, కొంతసేపు రామాయణ కాలక్షేపం చేద్దాంఅని, ఆ పుస్తకం విప్పి చదవడం మొదలెట్టాడు.

బ్రాహ్మడు రామాయణం చదవడం ఆ చుట్టుపట్ల చెట్ల మీదనున్న కోతులు చూచాయి. రామనామ శబ్దం వినగానే అవి అన్నీ వచ్చి మన బ్రాహ్మడికి ఎదురుగా రామాయణం వింటూ కూర్చున్నాయి.

బ్రాహ్మడు రామాయణంలో కొంతభాగం చదివి ముగించగానే ఆ కోతులన్నీ గబగబ చెట్లెక్కి ఇన్నిపళ్లు కోసి ఆ బ్రాహ్మడి ముందు పెట్టేవి. బ్రాహ్మడు ఆఫలాహారం చేసి హాయిగా అక్కడే పడుకున్నాడు. ఇదే బాగుండని అమర్నాడుకూడా అక్కడే రామాయణం చదివాడు. తిరిగి కోతులన్నీ రామాయణం విని బ్రాహ్మడికి పళ్లు బహుమానం చేశాయి. ఇలాగ ప్రతీ రోజూ బ్రాహ్మడు రామాయణం చదివి, కొన్నాళ్లకి కథ పూర్తిచేశాడు.

కోతులన్నీ చాలా సంతోషించి బ్రాహ్మడ్ని వరం కోరుకోమన్నాయి. బ్రాహ్మడు "నా ఇల్లు పోతోంది. నాఇల్లు నాకిప్పిస్తే చాలు" అని అడిగాడు.

వెంటనే కోతులన్నీ వెళ్లి ఒక్కొక్క కోతి ఒక్కొక్క



ఇటికను తెచ్చి బ్రాహ్మడి ముందు పెట్టాయి.

బ్రాహ్మడు గాబరా అయి, ఆ ఇటికలన్నీ మోసుకొని వెళ్ల లేక, ఒక మూడు ఇటికలు మాత్రం మోసుకొని ఇంటికి దారితీశాడు.

బ్రాహ్మడు ఇంటికి వస్తూ వుండగా, త్రోవలోనే సెట్టిగారి ఇల్లువుంది. "ఏవండోయ్ శాస్త్రుల్లుగారూ! మా బాకీ తెచ్చారా?" అని సెట్టిగారు అడిగారు.

"ఇదుగో నేను సంపాదించిన ఆస్తి యీ మూడు ఇటికలు మాత్రమే!" అంటూ అవి ఇచ్చేశాడు బ్రాహ్మడు.

నా కెందుకయ్యా ఈ ఇటికలూ! అంటూ పోనీ అంట్లు తోముకుందుకేనా పనికి వస్తాయని ఓ రెండు ఇటికలు తీసుకున్నాడు.

ఆ సాయంత్రం సెట్టిగారి భార్య, గిన్నెలు తోమడానికి, ఆ ఇటికను విరిచి గుండ చేయబోయింది. ఇటికను విరవగానే అందులోనుంచి ఘల్లున బంగారు మొహార్లు పడ్డాయి.

సెట్టిగారు అది చూచారు. ఆశ ఎక్కువయింది. గబగబ బ్రాహ్మడు ఇంటికి వచ్చాడు.


"ఏవండీ శాస్త్రుల్లుగారూ! మీకు ఆ ఇటికలు ఎక్కడివండీ" అని అడిగాడు.

"ఎందుకూ!? అని శాస్త్రులు గారు అడిగారు.

"ఏమీలేదు, మా పెరటి గోడ పడిపోయింది. ఇటికలు కావాలి. ఎక్కడ వున్నాయో చెబితే తెచ్చుకుంటాను" అని జవాబు చెప్పాడు.

"ఊరవతల ఆంజనేయ స్వామి గుడిదగ్గర బోలెడు ఇటిక






లున్నాయి తెచ్చుకోండి" అని చెప్పేశాడు బ్రాహ్మడు.

సెట్టి 16 బళ్లు తీసుకెళ్లి, ఇటికలతో నింపుకొని రహస్యంగా ఇంట్లో పెట్టుకున్నాడు. ఆ రాత్రి సెట్టికీ, సెట్టి భార్యకి నిద్రపట్టలేదు. ఊరికే కలలు కంటున్నారు. కలలో ఆంజనేయులు కనిపించాడు. ఆ ఆంజనేయులు తోక గిర్రున తిరిగింది. సెట్టివీపు మీద "సుర్" మని ఒకదెబ్బ పడింది.

"బాబోయ్! బాబోయ్!" అంటూ సెట్టి లేచాడు! వీపు తడుముకున్నాడు. వీపు మీద పెద్ద తట్టు కనబడింది.

ఇంతలో "బాబోయ్" అంటూ సెట్టిభార్య లేచింది. వీపు తడుముకుంది. వీపుమీద తట్టు!

"ఓయీ నీవు చేసినది దొంగపని! ఇటికలు ఆ బ్రాహ్మడివి. అవి వానికి ఇచ్చి వేయుము!" అంటూ మాటలు వినబడ్డాయి. ఎవరా మాటలూ! అంటూ తలుపు తెరిచేసరికి ఎదురుగా హనుమంతుడు ప్రత్యక్షం!



'సెట్టి వెంటనే హనుమంతుడి
ళ్లమీద పడ్డాడు. ఆ మర్నాడు
'ద్దున్నే ఆ ఇటికల్ని బ్రాహ్మ
ఇచ్చేశాడు.
బ్రాహ్మడికి ఈ సంగతి తెలి
ది. "ఆహా! రామాయణం
చదువుట వలన ఎంత లాభమో'
అంటూ ఆ బ్రాహ్మడు సంతో
షించాడు. హాయిగా ఒక ఇల్ల
కట్టుకున్నాడు. తనూ, తనగ
పెడు పిల్లలూ హాయిగ
వున్నారు.

లీసు :-ఏయ్ దొంగా! ఎం
దుకా కిటికీ ఊసలు లాగు
తున్నావు.
ంగ :-అబ్బే! ఏమీ లేదండి.
నేనుకూడా పోలీసు డిపార్ట
మెంటులో చేరుదామని కస
రత్తు చేస్తున్నాను.

పాలాది వెంకట రామకృష్ణమూర్తి
(కాకినాడ)



# సైకిల్ పందెం

వేణు, సీను స్నేహితులు.

వేణుకి సైకిలువుంది. సీనుకి సైకిలు లేదు. కాని సీను సైకిలు తొక్కగలడు. ఇద్దరికి సైకిల్ తొక్కటం బాగానే వచ్చు.


ఒకనాడు వేణూ సీనూ కలిసి అలాగ షికారు వెళ్తున్నారు. రోడ్డు చదునుగా మంచి తారు రోడ్డు. ఊరుదాటి కొంతదూరం వెళ్లాక వాళ్లకి ఒక బుద్ధిపుట్టింది. ఇద్దరిలో ఎవరు సైకిల్ బాగా (ఫాస్టుగా) తొక్కగలరో! కాని వున్నది ఒక్క సైకిలే! ఎలాగ? అప్పుడు వేణు సీనుతో ఇలా అన్నాడు:

"సీనూ! నేను ఈ మొదటి మైలు రాయినుండి 5-వ మైలు రాయివరకూ ముందు తొక్కుతాను. తరువాత నువ్వు 5-వ మైలునుండి 10-వ మైలువరకూ తొక్కు. ఎవరు ఎంతెంత టైములో తొక్కారో చూచి ఎవరు గెలిచారో తెలుసుకుందాం"

బాలా! ఈ సైకిల్ పందెంలో ఎవరు గెలుస్తారు? నువ్వు చెప్ప గలవా?

(జవాబు ఆఖరు పేజీలలో)






బాల ఇండియా రేడియో-రేలంగి
కేంద్రం - తెలుగులో వార్తలు;
చదువు చున్నది పి. వి. రత్నం.

లండన్‌లో ఒక క్రొత్తరకం మోటారుకారు కనిపెట్టారట. దీనిపేరు "ఎండ్రకాయ." ఇది ముందుకు, వెనక్కు, ప్రక్కలకు నీటిమీదకూడా నడుస్తుంది. దీనికి నాలుగు చక్రాలకు కలిసి ఒకే స్టీరింగ్ వుంటుంది. స్టీరింగ్ ఏవైపుకు త్రిప్పితే ఆవైపుకు నాలుగు చక్రాలు తిరుగుతాయి. రోడ్ల మీద పోయినంత వేగంగా, పొలాల్లోకూడా ఇది పోగలదు. దీన్ని పడవలాగ అతిసులభంగా ఉపయోగించుకోవచ్చు. ఇంకా దీనికి రెక్కలుకట్టి విమానంగా ఉపయోగించుకొనడానికి కూడా ఆలోచనలు జరుగుతున్నవి. నాలుగు చక్రాల స్టీరింగ్ మూలంగా, కొద్దిపాటి స్థలం వున్నప్పటికీ ప్రక్కకు తప్పుకొనడానికి, మామూలు కారులాగా కాక, సులభంగా దానిని నడిపించడానికి అవకాశంకలదు. ఇదిఎత్తయిన కొండలనుకూడా ఎక్కగలదు.

* * *

చెక్కలిలో ఎనిమిదికాళ్లు, రెండు తోకలు, రెండు మొండాలు, ఒకే మెడ, ఒక తలగల గొర్రెపిల్ల పుట్టింది. కాని అది వెంటనే చనిపోయింది.

* * *

ప్రపంచంలో మహా కోటీశ్వరుడని పేరువున్న నిజాం నవాబు ఆస్తి 36 కోట్లు మాత్రమేనట! అయినా అతని ఖర్చు రోజుకు అయిదు రూపాయిలేనట!

* * *

సహారాన్‌పూర్ అనే ఊరిలో తన కోడలు శకుంతలా దేవిని, కిరసనాయిలుపోసి నిప్పంటించి నిలువుగా కాల్చిన నేరానికి 65 ఏండ్లు ముసలి అత్తగారికి, ఆమె కుమార్తెకి జడ్జి ఉరిశిక్ష వేశాడు. అత్తగారికి తోడ్పడిన 13 ఏళ్ల రెండవ

కుమార్తెకి యావజ్జీవ కారాగార శిక్ష విధించబడింది.

* * *

ఒక నదిలో స్నానంచేసి వస్తున్న ఇద్దరు వృద్ధస్త్రీలు కనిపించగానే మారు వేషంలో వున్న ఒక సన్యాసి ఆశీర్వదించి ప్రసాదం పెట్టాడట. ఆ ప్రసాదాన్ని వారు తినగానే తెలివి తప్పి పడిపోగానే చెవికున్న పోగులు, వద్దనిమీది రూపాయలను దొంగిలించి పారిపోయాడట. ఆప్రసాదంలో పాపం విషం వుందట.

* * *

న్యూయార్కులో ఇటీవల కొత్తరకపు జేబుపంకాను తయారు చేశారట. ఈపంకా జేబులో పెట్టుకొని వెళ్లవచ్చును. దాని బరువు 3 ఔన్సులు.

* * *

మదనపల్లి దగ్గర ఒక మఱ్ఱి చెట్టు 15 ఎకరాలు ఆవరించిందట.

మీరీ వార్తలు బాలిండియా రేడియోనుంచి వింటున్నారు.

* * *

600 పౌనుల బరువు ఎత్తిన 20 ఏండ్ల ఛాంపియన్ తనకంటె రెండింతలు వయస్సుగల పడుచుని పెండ్లాడాడుట!

* * *

సైకిల్ త్రొక్కి త్రొక్కి అలసి పోయినవారికి కొంత విశ్రాంతి తీసుకొనే వ్యవధి ఇవ్వడానికి లండన్‌లో క్రొత్తగా చిన్న పెట్రోలు ఇంజన్ సైకిల్‌కు అమర్చబడింది. ఎంత బలంలేని వారైనా వంతెనలు వగైరా మెరకలను అవలీలగా ఎక్కడానికి ఇది ఉపయోగ పడుతుంది.

* * *

ఫ్రాన్సు దేశంలోని ఒక తాపీ మేస్త్రీ (వయస్సు 70 ఏళ్లు) ఇప్పుడు కల్గిన ఆడబిడ్డ సంతానంతో 36 మందట!

* * *

బ్రిటన్‌లో క్రొత్తగా ఒక విమానం గంటకు 430 మైళ్ల వేగంతో ప్రయాణం చేసింది. ఇంత వేగంగా ఇదివరలో ఏ విమానం చేసివుండలేదు.

* * *

న్యూఢిల్లీ - చెన్నపురి మధ్య ఇప్పుడు తెలుగులో టెలిగ్రాంలు పంపించుచున్నారు. వీటికి ఎక్స్‌ప్రెస్ రేట్లు వసూలు చేస్తూన్నారని బాలిండియా రేడియోప్రత్యేకవిలేఖరి తెలుపుతున్నాడు.

* * *

కాశీలో బంచనియా యనే పద్ధెనిమిది ఏండ్ల బాలిక మొగ వేషం వేసుకొని హీరాలాల్ అనే మారు పేరుతో వుంటూవుండగా, 1000 రూపాయల విలువ గలనగల దొంగతనం సందర్భముగా అరెస్టు చేయబడింది. ఆమెను చూసి అంతా నివ్వెర పోయారు.

* * *

స్వీడన్ లో దేశంలోని ఒక ఫ్యాక్టరీ, వెన్నను చెడిపోకుండా నిలవచేసి, సులువుగా రవాణా చేయడానికి వీలుగా తెల్లనిపొడి తయారు చేస్తున్నది. ఈ పొడికి అయిదు వంతులు చొప్పున నీళ్ళు చేర్చితే చాలు, అది పరిమళ భరితమైన తాజా వెన్నగా మారిపోతుంది.

* * *

ఇటీవల కలకత్తా బజారులో ఒక బెబ్బులిని ఒక బోను నుంచి మరొక బోనుకి మారుస్తుండగా కావలి వానిని నమిలివేసి, తప్పించుకొని వీధిని పడింది! ఇక్కడనుంచి వీధులూడ్చేవారి ఇండ్లలో దూరిందట. అక్కడివారు గోలపెట్టగా బజారుకు పరుగెత్తిందట. పోలీసులు చివరకు తరిమి మరల పట్టుకున్నారు.

మీరీ వార్తలు బాలిండియా రేడియో నుంచి వింటున్నారు.

* * *

16 ఏళ్ల వయస్సులోపు పిల్లలు రాత్రి 10 గంటలు దాటిన తరువాత రోడ్లమీద ఒంటరిగా తిరుగుతూ కనిపిస్తే పోలీసులు వారిని పట్టుకొని యిండ్లవద్ద అప్పజెప్పి అలక్ష్యంగా పిల్లలను వదిలిపెట్టినందుకు తలిదండ్రుల నుంచి జరిమానా వసూలు చేయడానికి లండన్ లో నిర్ణయించారట!

* * *


ఆఫ్రికాలో ఒక బస్సులో ఒక సింహందూరి కూర్చుందట. ఆ బస్సులో ఎవరో ప్రయాణీకులు మాంసంతీసుకొని పోతుంటే ఆ వాసనకి ఆ సింహం వచ్చేసిందట. బస్సు డ్రైవరు ఆ బస్సును 60 మైళ్ల స్పీడులో నడిపిస్తే ఆ సింహం బెదిరి పారిపోయిందట.


* * *

♦ దేశంలో వాతావరణం. ఇంకా ఇంకా బాల పత్రికలు రావచ్చునని భావిస్తున్నారు.

* * *

ఇంతటితో వార్తలు సమాప్తి. మళ్లీ ఇదే రోజున వార్తలు వింటారు.


2
3
4
5




గోటూర్ భవానీశంకర్ & కె. రామమూర్తి

బాలా! నారదుడిపేరు నీవు వినే వుంటావు. నారదుడు నారాయణ భక్తుడు. ఎప్పుడూ "నారాయణ! నారాయణ!" అని తంబూరా మీద పాడుతూ వుంటాడు.

ఒకనాడు నారదుడికి ఎందుకో ఒక సందేహం కలిగింది. నారాయణ! నారాయణ! అంటూ స్మరణ చేసినంతమాత్రాన ఏమిటి లాభం? అని సందేహం కలిగింది.

తిన్నగా, ఊరుకోక, బ్రహ్మ దగ్గరకు వెళ్లాడు. బ్రహ్మని అడిగాడు. బ్రహ్మ నవ్వి, "కుమారా! నారదా! ఇటువంటి పిచ్చి పిచ్చి ప్రశ్నలు వేయకు. ఊరుకో!" అని చెప్పి పంపించేశాడు.

నారదుడికి ఉండబట్టింది కాదు. ఎలాగైనా నారాయణ నామస్మరణ వలన లాభం తెలుసుకోవాలని గట్టిగా బుద్ధి పుట్టింది.

సరే. తిన్నగా ఆ నారాయణుడి దగ్గరకేవెళ్లి వానినే అడుగుతాను. ఆమాత్రం ఆ నారాయణునికి తెలియక పోతుందా అని మహావిష్ణువు దగ్గరకు వెళ్లాడు.

నారాయణుడే మహావిష్ణువని మీకు తెలుసుననుకుంటాను.

నారదుడు రావటం చూచి మహావిష్ణువు మనసులో 'వీడేదో తగువు తెచ్చాడు. సరే విందాం' అని కూర్చున్నాడు. నారదుడు దగ్గరకు రాగానే "నారదా! చాలా రోజులకు కనబడ్డావే? ముల్లోకాలూ ఎలా వున్నాయి. నీవు రాకారణం ఏమిటి?" అని అడిగాడు.

"దేవా! ముల్లోకాలూ ఎలా వున్నాయోగానీ, ముల్లోకాలకు తెలియని సందేహం కలిగింది.

తమ నామస్మరణవలన లాభం ఏమిటి? తెలుపండి'' అంటూ నిర్మొహమాటంగా అడిగాడు.

అప్పుడు ఆమహావిష్ణువు ఒక చిరునవ్వు నవ్వి "నారదా! నా నామస్మరణ వలన లాభం నాకే తెలియదు. అయినా దండకారణ్యంలో వుండే చిలుకని అడుగు'' అని చెప్పాడు.

నారదుడు వెంటనే దండకారణ్యానికి బయలుదేరాడు. అరణ్యం అంతా వెతికాడు. ఒక చెట్టుమీద ఒక చిలుక కనబడింది. దానినిచూడగానే: "ఓ చిలుకా! నారాయణ నామస్మరణ వల్ల కలిగేలాభమేమి?'' అని అడిగాడు.



వెంటనే ఆమాటలు వినగానే ఆచిలుక క్రింద పడి, తటపట కొట్టుకొని నారదుడి కాళ్లముందు తనప్రాణాలు విడిచేసింది.

"హా! నారాయణా! ఇదియేమి ఖర్మం! నావలన చిలుక అన్యాయంగా చచ్చిపోయిందే! లాభానికిబదులు నాకు పాపం చుట్టుకుందే'' అంటూ నారదుడు లబో లబోమంటూ తిన్నగా విష్ణువుదగ్గరకు వెళ్లాడు. నారదుని చూడగానే విష్ణువు: "ఏమి నారదా! నా నామస్మరణవలన లాభం తెలిసిందా'' అని అడిగాడు. "లాభమా! పక్షిని చంపిన పాపం నాకు చుట్టుకుంది. అంతకంటే వేరే లాభం నాకు కనిపించలేదు'' అన్నాడు నారదుడు.

అయితే యీసారి నీవు కాం

చన నగరం వెళ్లు. అక్కడ ఒక బీద బ్రాహ్మణుడు ఒక గోవును పూజిస్తూ వుంటాడు. ఆ గోవుకి తెల్లవారు ఝామునే ఒకదూడ పుడుతుంది. ఆదూడ పుట్టగానే దానిని ప్రశ్నించు. నీకే తెలుస్తుంది అన్నాడు విష్ణువు.

సరే ఇదేదో ఇదికూడా చూసి సందేహం తీర్చుకుందాం అని నారదుడు బయలుదేరాడు.

కాంచనపురంలో బ్రాహ్మడి ఇంటికి వెళ్లాడు. ఎవరికీ తెలియకుండా రహస్యంగా, పెరట్లో ఆవులసాల దగ్గర దాగున్నాడు. రాత్రంతా జాగరం చేశాడు. తెల్లవారు ఝామున వాళ్ల ఆవుకి దూడ పుట్టింది. పుట్టీ పుట్టంగానే నారదుడు "ఓదూడా! నారాయణ నామస్మరణ వలన లాభం ఏమిటి?" అని అడిగాడు. ఆ మాటలు వినగానే ఆదూడ క్రిందపడి కిలకిల కొట్టుకొని తారున చచ్చి వూరుకుంది!

"అయ్యో దేముడా! ఇదేమిటి ఈకొత్త వుపద్రం! గోహత్యకూడా చేశానే! అయ్యో! ఇప్పుడు రెండు పాపాలు చుట్టుకున్నాయే!" అంటూ నారదుడు మళ్లీ విష్ణువుదగ్గరకు వచ్చి చెప్పుకున్నాడు.

"అయితే నీ సందేహం ఇంకా తీరలేదన్నమాటే" అని విష్ణువు అడిగాడు.

రెండు పాపాలు చుట్టుకున్నాయి. చాలుచాలు! ఇంక నాకు



సందేహం తీరనక్కరలేదు. సెలవు" అన్నాడు నారదుడు.

"ఓయీ నారదా! సందేహాలు తీరకుండా అలా సగంలో వూరుకోకూడదు. వెళ్లు, స్వర్ణపురం వెళ్లు. స్వర్ణపురం రాజుగారి భార్యకు మగశిశువు పుడతాడు. ఆ శిశువు పుట్టగానే నేలమీద పడకుండా, బంగారు పళ్లెంలో సభలోనికి తెప్పించి ఆ శిశువును ప్రశ్నించు. నీ సందేహం తీరుతుంది" అని మహావిష్ణువు చెప్పాడు.

నారదుడు ఇంక చేసేది లేక స్వర్ణపురం వెళ్లేడు. రాజుగారి కొలువుకి వెళ్లి "రాజా! నీకు మగశిశువు జన్మిస్తాడు" అని జోస్యం చెప్పేడు. నిజంగానే మగశిశువు పుట్టాడు.

"రాజా! పుట్టిన బిడ్డని నేలను వుంచక, బంగారు పళ్లెంలో వుంచి యీ కొలువుకి తెప్పించండి. నేను ఆ శిశువుని ఒక చిన్న ప్రశ్న వేసి వెంటనే వెళ్లిపోతాను" అన్నాడు నారదుడు.



నారదుడి మాటలకు రాజు ఆశ్చర్యపోయాడు. అయినా, తన బిడ్డని బంగారు పళ్లెంలో తెప్పించాడు.


నారదుడు మనసులో భయపడుతూ ఆబిడ్డడ్ని "నారాయణ నామస్మరణ వలన లాభం ఏమి?" అని ప్రశ్న వేసి, ఆ బిడ్డ చనిపోతాడనే నమ్మకంతో పారిపోబోయాడు. ఇంతలో ఆబిడ్డ నవ్వుతూ ఇలా పలికింది :

"ఓ నారదమునీ! నేను

చిలుకరూపంలో వుండగా, నేను చనిపోయే ముందు నీనోటి వెంబడి నారాయణ శబ్దం విన్నాను. దానివలన నాకు ఉత్తమ జన్మ, గోవుకడుపున పుట్టాను. పుడుతూనే నాకు చావు రాసివుంది. కాని ఆసమయానికే నీవు నాచెవిలో నారాయణ నామస్మరణ వినిపించావు. దాని ఫలితంగా ఇప్పుడు నరజన్మలో, రాజుగారి కొడుకుగా పుట్టి, బంగారు పళ్లెంలో పెరుగుతున్నాను. 'నారాయణ' నామం వింటేనే ఇంతలాభం. ఎప్పుడూ స్మరణచేస్తే ఎంత లాభమో నీవే గ్రహించు" అన్నాడు ఆ బిడ్డడు.

నారదుడు అప్పుడు ఆరహస్యం అంతా గ్రహించి, బిడ్డని దీవించి వెళ్లిపోయాడు.

## బొమ్మలో తెనుగు కవి!



బాలా! ఈపై బొమ్మలు చూస్తే నీకు ఒక తెనుగుకవి జ్ఞాపకం రావాలి. ఎవరో తెలుసుకోగలవా? లేకపోతే ఆఖరు పేజీలలో చూడు—

కూర్పు: నండూరి వెంకటవీరరాజు (తుమ్మపాల)

# బాల

## మే నెల

### 21 ఆదివారం

అమ్మకి జ్వరం తగ్గలేదు. నాన్నకి సెలవు. నాన్నకూడా సాయం చేశారు వంటలో. తమాషా కబుర్లు చెప్పి బలేగా నవ్వించారు నాన్న.

### 22 సోమవారం

అమ్మ లేచి పనులు చేసుకుంటూంది. అన్నీ మామూలుగానే జరిగాయి. నాన్న రేడియో కంపెనీ కుత్తరం రాశారు.

### 23 మంగళవారం

'షావుకారు' సినిమాకెళ్ళాం. చెంగయ్య మామ, సుబ్బులూ బాగా వేశారు. రామి బలే నవ్వించింది. సినిమా చాలా బావుందన్నారంతా. తమ్ముడు సగం చూసి నిద్దరోయాడు.

### 24 బుధవారం

ఇవాళ అన్నయ్యొకటి చెప్పాడు. జాలేసిందినాకు. ఎవరో ఒకతను ముష్టి కుర్రాడికి చెల్లని సత్తుబేడ దానమిచ్చి

## 3 శనివారం

ఎక్కడో రెండు గూడ్సుబైళ్ళు గుద్దుకుని డ్రైవర్లు చనిపోయారట. ఈ మధ్య రైలు ప్రమాదాలు చాలా ఘోరంగా వున్నాయి. పాపం ఎంతమంది పోయారో!

## 4 ఆదివారం

పొద్దున్న రికార్డ్సు మధ్యాహ్నం ఆట విడుపు. సాయంత్రం రికార్డులు రేడియోలో! ఓ బలేగావుంది. ఇంటినిండా క్రెంతేస్.

## 5 సోమవారం

బడి తెరిచారు. అంతా కొత్తగా కనబడింది పాతబడే. పాఠాలు చెప్పలేదు. సరదాగావుంది.

## 6 మంగళవారం

తమ్ముడ్ని నాలుగో క్లాసులో చేర్చారు. అందరికీ మిఠాయి పంచాడు. రేడియో కుత్తరం రాశాం.

## 7 బుధవారం

కొత్త పుస్తకాలొచ్చాయి. మధ్యాహ్నంకొన్నా. అన్నింటికీ సాయంత్రం అట్టలువేసి నాన్నచేత పేర్లు రాయించుకొన్నా.

## 8 గురువారం

చిన్నబట్టల పెట్టెలో వచ్చాడా బీదబ్బాయి రామారావు. తమ్ముడికి రోజూ పాఠంచెప్పి మాయింట్లోనే వుండిపొమ్మన్నారు నాన్న. అబ్బాయి ఎంతో సంతోషించాడు. అమ్మ కొంచెం విసుక్కుంది.

## 9 శుక్రవారం

రామానికి మాయిల్లంతా చూపించాడు తమ్ముడు. మా పెంకితమ్ముడితో ఎలా జట్టుకట్టాడో రామం!

## 10 శనివారం

పొద్దున్నే రేడియో విన్నాం. తర్వాత రామం తమ్ముడికి చదువు చెప్పాడు. చాలా గమ్మత్తుగా కబుర్లు చెప్తూ చదివించాడు.

## 11 ఆదివారం

భద్రాచలం దగ్గర ఓ తెల్లటి పెద్ద పులి కనబడిందట. ఎలా వుంటుందో! రేడియోలో తమ్ముడి పేరు చెప్పారు.

## 12 సోమవారం

కొత్త పాఠాలు మొదలెట్టారివాళ. కొత్త తెలుగు మేష్టారు చాలా మంచివారు. బలేగా నవ్వించారు. నోట్సులు బాగా రాసిన వారికి బహుమానమట!

## 13 మంగళవారం

రామాన్ని చూసి తమ్ముడు కూడా పొద్దున్నే లేస్తున్నాడు. అందరూ లేచేసరికి రామం, తమ్ముడూ స్నానం చేసి చదువుకుంటున్నారు.

## 14 బుధవారం

మావయ్యొచ్చాడు పూర్ణించి. గ్లోరియస్ గావుండి కిటికీలో తలమార్చుకుని సుగం ఎక్కాట్ట. ఈలోగా బయట కాళ్ళనున్న కొత్త చెప్పులు ఎవరో కొట్టేశారు; నా కొక్కటే నవ్వు.

## 15 గురువారం

ఇవాళ క్లాసులో బలే చిత్రం చూశా. జపానులో రెండేళ్ళ పాప ఎనిమిదింపావు అంగుళాలెత్తు 8½ పౌ॥ బరువుట!

## 16 శుక్రవారం

సైన్సు మాష్టారో విషయం చెప్పారు. J. B. డన్‌లప్ అనే ఆయన ట్యూబులుండే సైకిలు టైర్లు మొదట కనిపెట్టారట. పూర్వం సైకిలికుత్త ఇనప చక్రాలే.

## 17 శనివారం

సంగీతం టీచరు గీతాలు మొదలెట్టారు. రేడియో బాగా వినమన్నారు. అమ్మ తెల్లారగట్ల లేపుతానంది సాధనకి.

## 18 ఆదివారం

నాన్నగారితో టీపార్టీకెళ్ళాం నేనూ తమ్ముడూనూ. అంతా అయ్యాక బయటకొచ్చేసరికి యిద్దరు కుర్రాళ్ళు కొట్టుకుంటున్నారు బయట పారేసిన టిఫిన్ కోసం. ఈలోగా కుక్కొచ్చి అది తినేసింది. నా కేడుపొచ్చింది.

## 19 సోమవారం

ఇవాళ కొంచెం వానొచ్చింది. గోదావరికెళ్ళలేదు. అకస్మాత్తుగా నాన్నొచ్చి సినిమాకి తీసికెళ్ళారు అందర్నీ. 'మొదటి రాత్రి' సినిమా. శివాయ్ చాలా బాగా చేశాడు.

## 20 మంగళవారం

డైరీ రాసినంతవరకూ కాపీచేసి బాలకి పంపా.

'లలిత'

# సిమ్లా బాలలు


రచన: సో. రామచంద్ర అగస్త్య ఎం. ఏ.

[మనం మనవూరును విడిచి కొత్తకొత్త స్థలాలకు వెళ్తే అక్కడ కొత్తకొత్త బాలలు కనిపిస్తారు. వాళ్ల వేషం, వాళ్ల భాష, వాళ్ల ఆటపాటలు మనకి వింతగా కనిపిస్తాయి. ఈ వ్యాసంలో అగస్త్య మామయ్య మనని సిమ్లాకి తీసుకెళ్లి అక్కడి బాలల్ని గురించి చెప్తారు పదండి—సం॥]

చిట్టి చెల్లాయిలూ! చిట్టి తమ్ముళ్లూ! మీకు సిమ్లా బాలల్ని గురించి చెప్పేందుకు ముందుగా సిమ్లాని గురించి కొద్దిగా చెబుతాను. మీరు మదరాసు సెంట్రలు స్టేషనులో ఉదయం గ్రాండు ట్రంకు ఎక్స్‌ప్రెస్సుని ఎక్కారంటే మూడవ రోజు ఉదయం తొమ్మిదిగంటలకు అనగా రమారమి రెండు రోజులు పూర్తిగా గడిచిన తర్వాత అన్నమాట, పాత ఢిల్లీ స్టేషనుని చేరుకుంటారు. ఢిల్లీ స్టేషనులు రెండు ఉన్నాయి—కొత్త ఢిల్లీ పాత ఢిల్లీ. పాతఢిల్లీ చాలా పెద్ద జంక్షను. విజయవాడకన్నా కూడా చాలా పెద్దది. అక్కడ ఎన్నో ప్లాటుఫారాలున్నాయి. పొరపాటున ఒక ప్లాటుఫారానికి బదులుగా ఇంకో ప్లాటుఫారంలోగాని రైలు ఎక్కారంటే మీరు అనుకోని ఊరు వెళ్లి చేరతారు.

సిమ్లాకి వెళ్లాలంటే, ఢిల్లీనుండి కాల్కాకి రైలులో వెళ్లాలి. కాల్కానుండి సిమ్లాకు బస్సులూ, మోటారు కారులూ కూడా వెడుతూ ఉంటాయి. అయినా వాటిలో ప్రయాణం చేస్తే తరుచుగా ఎత్తు పల్లాలు దాటుతూ వెళ్ళవలసి నందువల్ల మీకు తప్పక వాంతులు వస్తాయి అందుచేత బాలలందరూ రైలులో ప్రయాణం చేయడమే చాలా మంచిది. ఆపదలుకూడా అంతగా


రావు. బస్సులో వెళ్లేటప్పుడు ఎక్కువ ఎత్తైన ప్రదేశంనుండి చాలా లోతుగా ఉన్న ప్రదేశాన్ని చూచేరంటే కళ్లు గిరగిరా తిరిగిపోతాయి. అందువల్ల ఒకొక్కప్పుడు వాంతులుకూడా కలుగుతూ ఉంటాయి. అందువల్ల అన్నివిధాలా రైలులో వెళ్ళడమే మంచిది.




కాల్కాకీ సిమ్లాకీ మధ్యనున్న దూరము 50 మైళ్లే. అయినప్పటికీ రైలు, మెయిలు బండి అయినా సరే, సిమ్లాని చేరుకునేందుకు అథవా ఏడు గంటలయినా పడుతుంది! కారణమేమిటో తెలుసా? రైలు వెళ్ళవలసిన ప్రదేశం కొండప్రదేశం. చాలాఎత్తు ఎక్కవలసియున్నది. అదీగాక రైలు, మనుష్యులెక్కలాగ, కొండని సూటిగా ఎక్కలేదు. కొండలచుట్టూ తిరుగుతూ నింపాదిగా ఎక్కుతూ వస్తుంది. అందువల్ల ప్రయాణం చెయ్యడానికి చాలాసేపు పడుతుంది. ఈ 50 మైళ్ల దూరములో 103 సొరంగాలగుండా రైలు వెళ్లవలసియున్నది. కొండల్ని తొలిచి సొరంగాల్ని తయారు చేశారు. ఈ సొరంగాలగుండా రైలు వెడుతుంది. రైలు వీటిగుండా వెళ్లేప్పుడు, ఎంతో చీకటిగా ఉంటుంది. అందుచేత రైలు ఈ సొరంగాలగుండా వెళ్తున్నప్పుడు, ఏ సమయాన్న అయినాసరే, లైట్లు వెలుగుతూ ఉంటాయి. ఇంజను విడిచే పొగ రైలుపెట్టెలలోకి వస్తుంది కాబట్టి మనం అప్పుడు జేబు రుమాలులో ముక్కు మూసుకోవలసి వస్తున్నది. బడోగ్ అనే స్టేషను దగ్గిర సుమారు ఒక మైలు పొడవుగల ఒక సొరంగం ఉన్నది.


రైలు వానిని దాటడానికి సుమారు 7 నిమిషాలు పడుతుంది. అదే పెద్ద సొరంగం.

మెయిలు లో బయలుదేరి ఉంటే మీరు మధ్యాహ్నం 1-45 గంటలకు సిమ్లా స్టేషను చేరుకుంటారు. మూడవ తరగతి పెట్టెలున్న సాధారణ బండిలో బయలుదేరితే, కాల్కా ని 7-45 గంటలకు విడిచేబండి అన్న మాట, మధ్యాహ్నం 2-45 గంటలకు సిమ్లాను చేరుకుంటారు. సెప్టెంబరు అక్టోబరు నెలల్లో గాని, ఆటుతర్వాతగాని మీరు సిమ్లాకి వచ్చేలాగుంటే, సిమ్లా రెండు మూడు స్టేషనులలో వచ్చేస్తుందనగా ఊలు బనియనుని (స్వెట్టరు) ని మీరు తప్పక తొడుగుకోవాలి. వీలైతే ఊలు కోటు, షరాయిని ధరించాలి. లేకపోతే చలిలో గజగజ వణికిపోతారు. ఏప్రిలు నెలలో నేను మదరాసునుండి సిమ్లాకు తిరిగి వచ్చేను. అప్పుడుకూడా సిమ్లాని సమీపిస్తుండగా నాకు కొద్దిగా చలివేసింది. అందుచేత మీరు సింలాకి ఎప్పుడు వచ్చినాసరే, అది ఎంతమండు వేసవికాలమైనా సరే, ఊలు బనియను ధరించడం చాలా మంచిది. దానికి నేను కారణం చెబుతాను వినండి. మన ప్రదేశాలు చాలా వేడైన ప్రదేశాలు. సిమ్లా చాలా చల్లని ప్రదేశం. సముద్రమట్టము నుండి సుమారు 7000 అడుగుల ఎత్తున ఉన్నది. చెన్నపట్టణము నుండి 1801 మైళ్ళ దూరములో నున్నది. భూమధ్యరేఖకి దూరంగా ఉన్నది. చాలా



ఎక్కువగా ఉన్నది. అందుచేత ఇక్కడ ఎప్పుడూ చల్లగానే ఉంటుంది. ఎక్కువ వేడిగా ఉండే ప్రదేశంనుండి ఎక్కువ చలిగా ఉండే ప్రదేశానికి వచ్చేటప్పుడు, మీరు తగుజాగ్రత్త తీసుకోకపోతే, తప్పక జలుబు చేస్తుంది. గుండెలకి చలిగాలి తగలకుండా కాపాడుకోవాలి. అందుకనే మీరు ఊలుబనియనుల్ని తప్పకుండా మర్చిపోకుండా తొడుగుకోవాలి.

సింలాలో మీకెవరైనా మిత్రులుకాని బంధువులుకాని ఉంటే మీరు దర్జాగా ఏకష్టమూ లేకుండా తిన్నగా వాళ్ళింటికి వెడతారు. అలాగ లేకపోతే హోటలుకి వెళ్ళాలి. ఎక్కడికి వెళ్ళవలసినా చెన్నపట్టణంలో లాగ కారులో గాని, బస్సులో గాని ఆఖరకి ట్రాము బండిలో గాని ఇక్కడ వెళ్ళడానికి వీలు లేదు. కొండ ప్రదేశం అవ్వడంవల్ల ఎత్తు పల్లాలు బాగా ఉండడవల్ల ఇక్కడ బస్సు వెళ్ళడాని వీలు లేదు. అందుచేత ఎంత ధనికుడైనా, ఎంత గొప్పవాడైనా ఇక్కడ నడవవలసిందే. లేపోతే రిక్షాలో ఎక్కి వెళ్ళాలి. రిక్షాలో ఒకరే ఎక్కడానికి వీలౌతుంది. మద్రాసు రిక్షాలో లాగ ఒక బండిసామాను ఇందులో మోసుకు వెళ్ళడానికి వీలు లేదు. చాలా తేలికైన వస్తువుల్నే ఇందులో మోసుకు వెళ్ళాలి. అందుచేత ఈ ఊరికి వచ్చేవారేమి చేస్తారంటే సామానుల్ని కూలీవాళ్ళకి అప్పజెప్పి, తాము కాలినడకని బయలు



దేరతారు. ఇక్కడ రైల్వే కూలీలు ఎర్రటి చొక్కాలు తొడుకుని ఉంటారు. మదరాసు కూలీలు నీలపు రంగు చొక్కాలు తొడుగుకునేలాగ, ఈ కూలీలు చాలా బలమైనవాళ్లు, చూడడానికి బక్క పలచగా, ఊచలాగున్నా వీళ్ళకి బలం చాలా హెచ్చు. ఒక్కొక్కడు చలాగ్గా నాలుగైదు ట్రంకు పెట్టెల్ని మోసేస్తాడు. మన దేశపు కూలీ ఈ కొండ ప్రదేశంలో ఒక ట్రంకు పెట్టెనుకూడా మోయలేడు. మనిషి నడవడమే కష్టమంటే ఇక బరువు మొయ్యడ మెలాగ చెప్పండి. అయినా ఇక్కడ కూలీలుమాత్రం ఏ జంకూ లేకుండా ఎంత బరువైనా సరే మోసేస్తారు. వారు బరువు మోసుకుని కొండల్ని దిగుతూ వస్తూ ఉండగా మీరు చూచినట్లైతే, మీకు తప్పకుండా హనుమంతుడు సంజీవి పర్వతాన్ని మోసుకు వచ్చిన దృశ్యం తప్పక జ్ఞాపకానికి వస్తుంది. వారు అంత బరువుని ఇంత కష్టపడి మోసినా, అడిగిన కూలీకంటె ఒక్కదమ్మిడీ ఎక్కువ, మీయంతట మీరే ఇచ్చినా సరే, పుచ్చుకోరు. అయితే ఒకటి, వారు అడిగిన కూలీ ఇచ్చేయాలి. అంతకి దమ్మిడీ తక్కువ ఇస్తే మిమ్మల్ని విడిచి పెట్టరు. వాళ్ళను మీరు నమ్మి ఏవస్తువునైనా సరే అప్పగించ వచ్చును. మీరు వాళ్ళతోకూడా వెళ్ళకుండా ఫలానా చోటికి సామానాల్ని తీసుకువెళ్లమంటే, వాళ్ళు తప్పక తీసుకువెడతారు. వాటిని తీసుకుని ఎక్కడికైనా పారిపోతారేమో అనే భయం మీకుండ నలసిన అవసరంలేదు.

(ఇంకా వుంది)

---


"నవ్యాంధ్ర"

[ప్రఖ్యాత వైజ్ఞానిక మాసపత్రిక]

సైజు డెమ్మీ ¼; పేజీలు 20 విడిప్రతిక 0-2-0 సంవత్సరం చందా 3-0-0 ఏజంట్లకు కమిషను [illegible] %; డిపాజిట్టు అవసరం లేదు.

క్రొత్తరకపు రచనలు నూతనమైన విమర్శలు [illegible] ప్ర[illegible]పబడిన రచనలకు తగిన ప్రతిఫలం ఇవ్వబడుతుంది. [illegible]సారి కలంపట్టి వ్రాసే ఉత్సాహవంతులకు తగిన ప్రోత్సాహాన్ని చేయూతనూ ఇవ్వడమే మా ప్రధాన కర్తవ్యం.

ఏజంటుకు ప్రకటన దారులకూ చందాదారులు గాకోరువారికి కోరినచో. మాదిరి ప్రతి పంపబడును:

"నవ్యాంధ్ర"

27, బిందావన్ బిల్డింగ్

సుల్తాన్ బజారు, హైద్రాబాద్, దక్కన్

ప్ర:-పరీక్షలో తప్పిపోయిన కుర్రాడి హృదయం ఎలా గుంటుం దన్నయ్యా?

—యమ్. వి. వేణుగోపాలరావు (శికింద్రాబాదు)

జ:-వాడెన్నోసారి తప్పిపోయాడో దాన్నిబట్టి వుంటుంది. నీకా అనుభవం కలుగకుండు గాక!

ప్ర:-మజ్జిగలో నుండే కదా నేయి తయారయింది. మరి మజ్జిగ అన్నములో నెయ్యి ఎందుకు వేసుకోరు?

—కె. యన్. పి. బాబు (శ్రీకాకుళం)

జ-:పప్పులో నెయ్యి వుండదు కనుక పప్పు అన్నంలో నెయ్యి వేసుకుంటున్నాం. మజ్జిగలో వెన్న వుంది గనుక మళ్ళి నెయ్యి ఎందుకు?

ప్ర:-ప్రీతిగల తిండి పదార్థమును చూచిన యెడల నోరు ఎందుచేత ఊరును?

—బత్తీ రంగారావు (జంపెన్నురము)

జ-:తినాలని బుద్ధి పుడుతుంది గనుక.

ప్ర:-నాతలనొప్పి బాధ ఎన్ని మందులు ఇంజెక్షను తీసుకున్నా నయంకాలేదు. నా తలనొప్పి పోయే మార్గం చెబుతారా?

—అల్లసాని శీతారామరావు (ఆదవాని)


జ:-'బాల' పత్రికను ప్రతినెలా చదువు.

ప్ర:-మీరు పిల్లలకొరకు పాటు పడతా మంటున్నారు. ఆ పాటు యేపాటు అన్నయ్యా?

—A. పద్మావతి (బొబ్బిలి)

జ:-అది నా గ్రహపాటు చెల్లెమ్మా.

అట్టముక్కలతో ఆట (జవాబ



| బాలానందం | ఆటవిడుపు |
|---|---|
| జులై 1950 | జులై 1950 |

## బాలానందం — జులై 1950

### 1-వ తేదీ శనివారం

రారండోయ్; అక్కయ్య కబుర్లు; తేని పోని పోకులు-నాటిక. పొడుపుకథలు; అంపులపాట; రికార్డు; మీపాటలు, పద్యాలు, చాలునింక.

### 8-వ తేదీ శనివారం

రారండోయ్; అక్కయ్య కబుర్లు; ఇచ్ఛకాలు; నాటిక - కల్పకం వంట- మీకథలు, పాటలు. చాలునింక.

### 15-వ తేదీ శనివారం

రారండోయ్; అక్కయ్య కబుర్లు; తాతయ్యతో పాపలు-నాటిక; చీమకథ (రికార్డు) మీపాటలు. పద్యాలు, మెరికె మాటలు చాలునింక.

### 22-వ తేదీ శనివారం

ప్రాణస్నేహం-నాటిక; అవగఅవగా కథ చిక్కుప్రశ్న, చిట్టిపొట్టి పాటలు చాలునింక.

### 29-వ తేదీ శనివారం

రారండోయ్; అక్కయ్య కబుర్లు; పిల్లల నాటకం-నాటిక. బొమ్మల పాటలు. మీకథలు: కబుర్లు, చాలునింక.

## ఆటవిడుపు — జులై 1950

### 2-వ తేదీ ఆదివారం

రారా చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; "నీ వెలివి"; ప్రశ్నలూ జవాబులు; నాగులమ్మ (పాట); తమాషాలు; పోదామా.

### 9-వ తేదీ ఆదివారం

రారా చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచీ; "సంతృప్తి [illegible]" నాటిక; "పంటలు పండించండి" (పాట); కథలు; కబుర్లూ; పోదామా.

### 16-వ తేదీ ఆదివారం

రారా చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; "రథయాత్ర" నాటిక; తాతయ్య-అక్కయ్య తగువు; కథలు, కబుర్లు; పోదామా.

### 23-వ తేదీ ఆదివారం

రారా చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచీ; "పొట్టిబావ కేసు," "బంగారు చెప్పు" నాటిక; పోదామా.

### 30-వ తేదీ ఆదివారం


రారా చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచీ; "కర్రచిలుక" నాటిక "చిలుకా!" పాట; హాస్యాలు; పోదామా.



# ాటలతో ఆటలు---నెం 9

లా! ఈదిగువ చదరంలోని అక్షరాలు నింపి,

ఉంచుకో! ఆగస్టు 'బాల'లో సమాధానం



## ఆధారాలు

**అడ్డము**

సంవత్సరములలో ఒకటి.

ు

కు.

ఇక్కట్టిగా వుండాలి.

పము పేరు.

ుక్క

ద్ద ఉంటుంది.

ు ఇది నేర్చుకోవాలి.

ంటుంది జాగ్రత్త!

**నిలువు**

2. తోట
3. భావ
4. సుగ్రము (ఒక ఫిలిం పేరు
6. మాటలలో చదరము.
7. నీ పెద్దలో పుట్టావు.
9. ఒక జంతువు.
10. జాబ (అదే)
11. నౌక
12. పువ్వు దళము
13. గోరు — పైకోకటి పో

# మాటలతో ఆటలు - 8

## (జవాబు)

అడ్డము: 2. విరి; 3. కిచకిచ; 5. మకరందము; 6. మసకలను; 8. ఆవుగోవు.
నిలువు: 1. కాకి, కేకి; 2. వివాహము, వివాదము; 4. చతురంగము, చదరంగము; 7. మల్లెపూవు; 7. ముని.

## బఫ్ఫూన్లు బలే బలే! (జవాబు)

3-వ బఫ్ఫూను 5-వ బఫ్ఫూను కవలలు.

## దాగుడు అవయవాలు (జవాబు)

1 కాలు; 2 మోకాలి; 3 చేయి; 4 చెవి; 5 [illegible]; 6 వీపు; 7 [illegible]; 8 వేలు; 9 తల; 10 [illegible] 11 కడుపు; 12 పిక్క 13 [illegible]; 14 నుదురు; 15 గడ్డము.

## పొడుపు కథలు (జవాబు)

1 మొగలిపువ్వు; 2 దువ్వెన; 3 ఆవు; 4 వెల్లుల్లి (తెల్లగడ్డ) 5 అశోక చక్రం; 6 సినిమా; 7 వార్తాపత్రిక; 8 రేడియో; 9 పాకిస్తాన్ జెండా

## ఊళ్ళ పేర్లు (జవాబు)

1 మద్రాసు; 2 కాకినాడ; 3 కరాచి; 4 మధుర; 5 కటకం; 6 గోవా; 7 గయ; 8 సతారా; 9 పూనా; 10 మగధ.

## వీరెవరు (జవాబులు)

1 టంగుటూరు ప్రకాశం; 2 చిత్తరంజనదాస్; 3 కొండా వెంకటప్పయ్య; 4 కాశీనాథుని నాగేశ్వరరావు; 5 దువ్వూరి రామిరెడ్డి: 6 సుభాస్ బోస్; 7 గాంధీ జీ.

## సైకిల్ పందెం (జవాబు)

వేణు గెలుస్తాడు. ఎందుకంటే మొదటి మైలురాయి నుండి 1-వ మైలు రాయికి నాలుగు మైళ్ళ దూరం వుంది. సీను 5-వ మైలురాయి వరకు 5 మైళ్ళు వెళ్ళాలి. అందుచేత వేణు గెలుస్తాడు.

## బొమ్మలో తెనుగుకవి (జవాబు)

ముక్కు తిమ్మన.

సుప్రసిద్ధ సినిమాతార టి. ఆర్. రజని, తన విశాలమైన కురుల సౌందర్యానికి కారణం

ప్రెసిడెంట్ వెజిటబుల్

హేరాయిలే నని చెప్పుచున్నది.




Edited and Published by N.Raghava Rao & Printed by N.Kames




కుమారి యు. దుర్గాలక్ష్మీబాల (విజయనగరం)

లేడీ! — — అబ్బాయా?



॥ నాగసరపు సత్యనారాయణ
(నరసారావుపేట)



కుమారి సోమయాజుల
వెంకటకామేశ్వరి (మద్రాసు)

# బాల

## మిఠాయిసంచిక

ఆగస్టులో వస్తుంది.

బలే బలే
కథలు
బొమ్మలు

100 పేజీలు వెల ఆరణాలే!

---

# BALA PRESS

FOR YOUR

JOB PRINTING

IN

ENGLISH & TE[illegible]UGU